ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు







నార బాంబులు పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు.. గాయాలపాలైన మృతుడి తల్లిదండ్రులు సావిత్రి, శ్రీనివాస్

వెలుగు వెంటే చీకటి ఉంటుంది.. ఆనందం వెంటే విషాదం ఉంటుంది.. కాస్త ఆదమరుపుగా ఉన్నామా పెను ప్రమాదమే సంభవిస్తుంది.. ప్రాణాలనే హరించేస్తుంది.. దీపావళి ఆనందం ఆదమరుపుగా ఉన్నామా ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే.. ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది.. లేదంటే జీవితాలు బుగ్గి పాలైపోతాయి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా ఏళ్లగా ఇదే సాగుతుంది.. ఎందుకంటే జిల్లాలో అధికార.. అనధికార బాణసంచా తయారీ కేంద్రాలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.. దీంతో ప్రతి ఏడాది జిల్లాను ఏదో ఒక ప్రమాదం వెంటాడుతూనే ఉంటుంది.. అయినా అధికారులకు మామూలే.. అన్నీ తెలిసినా చూసీచూడనట్టు వదిలేస్తారు.. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తారు.. ఈ ఏడాదీ అంతే. మరో మూడు రోజుల్లో దీపావళి పండుగకు సన్నద్ధమవుతున్నాం.. అయినా అధికారులు చేపట్టిన తనిఖీల్లేవ్.. పట్టుకున్న అనధికార తయారీ కేంద్రాలు లేవు.. సోమవారం మండపేట మండలం ఏడిదలో జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ. ఈ రెండు రోజులైనా అధికారులు మేల్కొంటే.. ప్రమాదాలను నివారించవచ్చు.. ప్రజల ప్రాణాలు కాపాడవచ్చు.



వెలుగు వెంటే చీకట్లు!

ఆదమరిస్తే.. జీవితాలే బుగ్గి



అమలాపురం మండలం రావులచెరువులో సంభవించిన విస్ఫోటనంతో కుప్పకూలిన భవనం (ఫైల్)



- ఉమ్మడి జిల్లాలో బాణసంచా ఫేమస్
- ఎక్కడికక్కడ తయారీ కేంద్రాలు
- అనధికారికమే ఎక్కువ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు
- ప్రతి ఏటా విషాదం..మామూలే!
- కన్నెత్తి చూడని అధికారులు
- తాజాగా ఏడిదలో ప్రమాదం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జీవితమే ఒక దీపావళి. కొన్ని కుటుంబాల్లో వెలుగులు నింపితే.. మరికొన్ని కుటుంబాల్లో చిమ్మచీకట్లు నింపుతోంది. దీపావళికోసం అహర్నిశలు శ్రమించి బాణసంచా తయారు చేయడంలో నిమగ్నమయ్యే కుటుంబాల్లో ఏదైనా తేడా వస్తే ప్రాణాలకే ముప్పువాటిల్లుతోంది. ఈ ప్రమాదాల బారినపడ్డవారిలో మృత్యువాత పడే వారి సంఖ్యే ఎక్కువ. మరికొందరు అంగవైకల్యంతో బతుకు జీవుడా అని జీవించాల్సిన పరిస్థితులు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో ఏటా ఎక్కడో ఒకచోట అగ్నిప్రమాదం సంభవిస్తోంది. దీంతో అందులో పనిచేసే తయారీ నిర్వాహకులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో మహిళల సంఖ్యా అధికంగానే ఉంటోంది. గత కొన్నేళ్ల కిందట అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెలలో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరు దివ్యాంగులుగా మిగిలారు. క్షతగాత్రులు బతుకు జీవుడా అని జీవనం సాగిస్తున్నారు. అమలాపురం పట్టణం రావులచెరువులో గత నెల 16వ తేదీన సంభవించిన భారీ విస్ఫోటనంలో గొవ్వాల నాగలక్ష్మి(55) చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. వారిలో కొందరు ఇప్పటికీ అనారోగ్యంతోనే ఇబ్బందిపడుతున్నారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే బాణసంచా ప్రమాదాల కారణంగా దశాబ్దకాలంగా విగతజీవులుగా మారిన వారి సంఖ్య భారీగానే ఉంది. అయితే కుటుంబ పోషణ నిమిత్తం బాణసంచా తయారీ కర్మాగారాల్లో సమీప ప్రాంతాలవారు పనులు చేస్తుంటారు. చాలీచాలని జీతాలతో కాలే కడుపులతోనే జీవిస్తున్నారు. తయారీ కేంద్రాల వద్ద సరైన భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు తలెత్తుతున్నాయని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డబ్బున్నవారు దీపావళి పండుగను వేడుకగా చేసుకుంటుంటే పేద కార్మికులు మాత్రం పస్తులతో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక కోనసీమలోని వివిధ ప్రాంతాలకు తమిళనాడు రాష్ట్రం నుంచి భారీగా బాణసంచా దిగుమతులు జరుగుతున్నాయి. ఈ సామగ్రి విక్రయాలకే ఈ ప్రాంత వ్యాపారులు మగ్గుచూపుతున్నారు. కోనసీమ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బాణసంచాకు సంబంధించి బాంబులు, సెర్చ్‌లైట్లు, మతాబులు, టపాసులు వంటివి తయారుచేసి విక్రయిస్తున్నారు.

ప్రమాదాలు ఇలా..

- 2019 సెప్టెంబరు 30న జీ.మేడపాడు కెనా ల్ రోడ్డులో ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు వ్య క్తులు మృతి చెందారు.
- 2023 ఏప్రిల్ 5న పెదపూడిలో జరిగిన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరి కొందరు గాయపడ్డారు.
- రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ఆంజనేయ ఫైర్‌వర్క్సులో రెండుసార్లు ప్రమాదాలు జరిగాయి. 1996 మే 1 జరిగిన ప్రమాదంలో కర్రి సత్యనారాయణ, ఆయన కుమారుడు కర్రి శ్రీనివాస్ మృతి చెందారు. తదుపరి మరో ప్రమాదంలో బొక్కా సత్తిబాబు అనే వ్యక్తి మృతి చెందాడు. 2003లో తోటపేటలో జరిగిన ప్రమాదంలో ప్రస్తుతం ఆంజనేయ ఫైర్ వర్క్సు యజమానిగా ఉన్న దవులూరి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. అదేవిధంగా రామచంద్రపురం మండలం జువ్విపాడులో ఆనందరావు బాణసంచా తయారీ కేంద్రం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదు గురు మృత్యువాతపడ్డారు. అందులోమహిళలు కూడా ఉన్నారు. బిక్కవోలు మండలం తొస్సిపూడిలో 2023లో జరిగిన ప్రమా దంలో పెట్రోల్ బంక్ ధ్వంసమైంది.

బాణసంచాకు కుటుంబమే బలి

2022 ఫిబ్రవరిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మండపేట పట్టణంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు.అన్నవరపు కోటేశ్వర రావు, కుమారుడు రవికుమార్ మృతిచెం దగా, కొద్దిరోజుల తర్వాత మరో ప్రమాదంలో కోటేశ్వరరావు పెద్ద కుమారుడు చంద్రరావు మృత్యువాతకు గురయ్యాడు. ఇక కోటేశ్వరరావు మనుమడు అయ్యప్ప రాజు, అతడి తల్లి కూడా ప్రమాదంలో కన్నుమూశారు.ఇలా కుటుంబమంతా మందుగుండు ప్రమాదంలోనే మరణించడం మరో విషాదం. అలాగే వారి వద్ద పనిచేసే ఇద్దరు కూలీలు కూడా రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో మరణించారు.

నార బాంబులు చుడుతుండగా పేలుడు

- భర్త మృతి..భార్య పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి గాయాలు..బాలుడు సేఫ్
- ఏడిదలో కుప్పకూలిన పెంకుటిల్లు

మండపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళి ఆ ఇంట విషాదం నింపింది.పండుగను పురస్కరించుకుని నార బాంబులు చుడుతుండగా పెనుప్రమాదం సంభవించింది... ఆదమరిస్తే ఎంత ప్రమాదమో చాటిచెప్పింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద పంచాయతీ ఆరో వార్డు రామాలయం వీధిలో కల్లి వెంకట కృష్ణ (30) రెండు పోర్షన్ల ఇంట్లో కుటుం బంతో నివాసం ఉంటున్నాడు. దీపావళిని పురస్కరించుకుని తన ఇంట్లో భార్య జయశ్రీతో కలిసి అవుట్లు తయారు చేస్తున్నాడు.ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఒక్కసారిగా మందుగుండు సామగ్రి పేలడంతో భారీ శబ్దం వచ్చింది.దీంతో అతని పెంకుటిల్లు పైకప్పుతో సహ, సమీపంలో ఉన్న వంటషెడ్డు (రేకుల షెడ్డు) కుప్ప కూలిపోయాయి. పేలుడుధాటికి వెంకట కృష్ణ తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడి భార్య జయశ్రీకి తీవ్రగాయాలు కాగా ఆమెను మండపేట ఆసుపత్రికి తరలిం చి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో మృతుడు వెంకట కృష్ణ తండ్రి శ్రీనివాస్, తల్లి సావిత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఒక్కసారిగా పేలు డు సంభవించడంతో వారిద్దరూ తీవ్రగా యాలపాలయ్యారు. 108లో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.మృతుడు వెంకటకృష్ణకు ఏడాది బాబు ఉన్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండడంతో క్షేమంగా బయటపడ్డాడు.ఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, రూరల్, సీఐ పీతల దొరైరాజు, రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు,జిల్లా ఫైర్‌అధికారి పార్థసారథి,మండపేట ఫైర్ అధికారి హనుమంతరావు పర్యవేక్షించారు. మండపేట తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాద ఘటనపై ఎమ్మె ల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కాకినాడ ప్ర భుత్వ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరి గేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పదేళ్లయినా.. అందని సాయం

- వాకతిప్ప పేలుడుకు పదేళ్లు
- 18 మంది దుర్మరణం
- కూటమి ఆదుకోవాలని వినతి

కొత్తపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో బాణసంచా కేంద్రంలో పదేళ్ల కిందట అక్టోబరు నెలలో సంభవించిన పేలుళ్లలో మొత్తం 18 మంది దుర్మరణం పాలయ్యారు.వీరంతా వాకతిప్ప దళిత కాలనీకి చెందిన వారు. బాణసంచా పేలుళ్లలో మృతిచెందిన కుటుంబాలకు అప్పటి సీఎం చంద్ర బాబునాయుడు రూ.2 లక్షల నగదు, స్థానిక విద్యుత్ ప్లాంటు యాజమాన్యం రూ.50 వేలు, పలువురు దాతలు ఆర్థిక సాయం అందిం చారు. బాధిత కుటుంబాలకు మూలపేటలో సర్వే నంబరు 41,42లో అరెకరం చొప్పున 9 ఎకరాల భూమి మంజూరు చేశారు. పేలుడు సంఘ టనలో మృతిచెందిన 18 మందిలో 12 మంది మహిళలు వాకతిప్పకు చెందిన వారే. మిగిలిన ఆరుగురు నిదానందొడ్డి, కలవల దొడ్డికి చెందినవారు.అప్పట్లో అరెకరం భూమికి సంబంధించిన పట్టాలను అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పట్టాలు ఇచ్చాక అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరికి ఆ భూమిని అప్పగించలేదు. దీంతో ఈ భూముల వ్యవహారం ఇప్ప టికీ కొలిక్కిరాలేదు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం భూమి అప్పగిం చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టాలిచ్చిందికానీ..భూమివ్వలేదు..



పేలుళ్లలో మృతిచెందిన 18 కుటుంబాలకు మూలపేట సెజ్ భూముల సమీపంలో ఒక్కొక్కరికి 50 సెంట్ల భూమిని కేటాయించారు. మంత్రి చేతుల మీదుగా పట్టాలిచ్చినా భూమిని అప్పగించలేదు. జగన్ సీఎం అయ్యాక పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి 9 ఎకరాల భూమి ఇవ్వమని అప్పటి తహశీల్దార్ ఒత్తిడి తెచ్చారు. బాధితులు ఒక్కొక్కరికి 3 సెంట్ల భూమిచ్చి దానిలో ఇళ్లు కట్టించి ఇస్తామని భ్రమ కలిగించారు. మేము ఒప్పుకోకపోవడంతో అప్పటి నుంచి బాణసంచా బాధిత కుటుంబాలకు కేటాయించిన భూమి మాట పట్టించుకోలేదు.అప్పటి బాణసంచా ప్రమాదంలో తన భార్యవదిన, మరదలు, తమ్ముడు, మనవరాలు దుర్మరణం పాలయ్యారు. కూటమి ప్రభుత్వం బాణాసంచా బాధితులకు న్యాయం చేస్తుందని ఆశపడుతున్నాను. - **మసకపల్లి నాగేశ్వరరావు**

అతివేగం.. ఇద్దరు యువకులు మృతి | 7 | భార్యను చంపిన భర్తకు జీవితఖైదు



కందుకూరి వీరేశలింగం ఫైలాన్ ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్ చిత్రంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే అప్పారావు తదితరలు

నేనూ ఇక్కడే చదువుకున్నా..

కందుకూరి వీరేశలింగం డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేనూ ఈ కళాశాలలోనే చదువుకున్నా..నేడు మంత్రి హోదాలో కళాశాలకు రావడం ఆనందంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆనంద ఉద్యానవనంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకకు హాజరై మాట్లాడారు. ఎంతో మందికి కందుకూరి కళాశాల పునాదిగా నిలిచిందన్నారు. తాను కూడా కందుకూరి కళాశాల పూర్వ విద్యార్థినేనని గుర్తు చేశారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తి ప్రతి విద్యార్థిలోనూ నిలవాలన్నారు. తొలుత మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు స్వర్ణోత్సవ ఫైలాన్ ఆవిష్కరించారు.తొలుత వీరేశలింగం విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం పూర్వపు ఛైర్మన్లు చల్లా శంకరరావు,బుడ్డిగ శ్రీనివాస్, దాసి వెంకట్రావు, యాళ్ళ ప్రదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, వీటీ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ శాంతారాజ్యం, పసుపులేటి శ్రీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 28: కలెక్టరేట్‌కు ప్రజలు పెద్దఎత్తున సమస్యలతో పోటెత్తారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజానగరం మండలం పాలచర్ల గ్రామంలో సర్వే నెంబరు 2282/1985లో 316 చదరపు గజాల భూమిని చట్టపరంగా తాను కొనుగోలు చేసానని.. అయితే ఆ భూమిని వేరేవారు కబ్జాచేసి ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని బాధిత మహిళ మల్లెల రామలక్ష్మి ఫిర్యాదు చేశారు.తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం జీవో రద్దు చేయడం దారుణమని అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. జీవోను పునరుద్ధరించాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతామన్నారు. 25 శాతం ఉచిత సీట్లను పునరుద్ధరించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 30 మంది బాధితులు జేసీని కలిశారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం కోటిలింగాలు-3లో గతంలో సుబ్బారావుపేట ఫీల్డ్‌లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి కేటాయించిన ఇసుక ర్యాంప్ రద్దుచేయాలని మాజీ అధ్యక్షుడు అక్కాబత్తుల శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి మద్దా దుర్గారావు జేసీకి విన్నవించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 28 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలన చేసి వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం కోసం పలు ఆదేశాలు ఇచ్చారు. నిర్దేశిత సమయంలో సమస్యలు పరిష్కారం కావాలన్నారు.

డీఆర్‌వో బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ/రూరల్,అక్టోబరు (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి డీఆర్‌వోగా తామరాల సీతారామమూర్తి సోమవారం బాధ్యతలు స్వీక రించారు. సీతారామమూర్తి 1995లో ప్రొబిషనరీ డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీకాకుళం జిల్లా కవిట మండలంలో జాయినయ్యారు.విశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ విభా గం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. డీఆర్‌వో జేసీ చిన్నరాముడును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలి

జిల్లా ఎక్సయిజ్ అధికారి లావణ్య

రాజమహేంద్రవరం,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని కచ్చితంగా ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య పేర్కొన్నారు. అధిక ధరలకు అమ్మినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీ ప్రక్రియ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహించడం నేరమన్నారు. సారా, గంజాయి, నిల్వ, రవాణా విక్రయం, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు నిషేధమన్నారు. వీటికి సంబంధించి సమాచారం ఉంటే 7093273981 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎస్పీ



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్‌లు ఆర్యోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ నరసింహ కిషోర్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్స వంలో భాగంగా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబీకులకు కిమ్స్ బొల్లినేని హాస్పటల్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రారంభించి రక్తదానం చేశారు. కీళ్ల, క్యాన్సర్, యూరాలజీ, న్యూరా లజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడి యాట్రిక్స్, గైనిక్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్,గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ విభాగాలకు చెందిన 22 మంది వైద్య నిపుణులు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు.మందులను ఉచితంగా అందజేశారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. తొలుతగా కిమ్స్ వైద్యులను ఎస్పీ సత్కరించారు.ఈడీ రామ్మోహన్ మాట్లాడుతూ సేవాభావంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వ హిస్తున్నామన్నారు. కిమ్స్ సీఈవో, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామరాజు మాట్లాడుతూ త్వరలోనే క్యాన్సర్, ఈఎన్‌టీ, డెంటల్, తల్లి పిల్లల అత్యాధునిక వైద్య విభాగాలు పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామన్నారు.

విల్లులా వంగుతారు!

జిమ్నాస్టిక్స్‌లో రాణిస్తున్న క్రీడాకారులు





విల్లులా వంగగలరు.. పక్షిలా ఎగరగలరు.. చిరుతలా దూకగలరు.. శరీరాన్ని ఎటువైపైనా తిప్పగలరు.. వీళ్లే జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు. వీళ్లంతా విభిన్న మార్గం ఎంచుకున్నారు. అందరిలా కాదు.. తాము ప్రత్యేకం అని నిరూపించుకునే మార్గంలో పయనిస్తున్నారు. మెరికల్లాంటి ఈ క్రీడాకారులు ఎక్కడో కాదు మన దగ్గరే ఉన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిల్లో తమ సత్తా చాటి ఒలింపిక్స్‌లాంటి వేదికలపై తమకంటూ ఒక గుర్తింపు ఉండాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నారు. విద్యతోపాటే తమకు ఆసక్తికరమైన జిమ్నాస్టిక్స్ రంగంలో నైపుణ్యం సాధిస్తున్నారు.. దీనికి అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ నైపుణ్యం కలిపి వీళ్లంతా ఉన్నత శిఖరాలు అధిరోహించే దిశగా అడుగులు వేస్తున్నారు.

కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఉన్న జిమ్నాస్టిక్స్ ఆడిటోరియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఇప్పటికే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ కనబర్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా కఠోర శ్రమ చేస్తున్నారు. విజయాన్ని సొంతం చేసుకోవాలన్న తపన ఈ క్రీడాకారులు ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది.

ఎల్‌కేజీ నుంచే శిక్షణ

రాష్ట్రంలోనే అతిపెద్ద జిమ్నాస్టిక్ ఆడిటోరియం కాకినాడలో ఉంది. గుంటూరు తర్వాత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు జిమ్నాస్టిక్స్‌లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ప్రారంభంలోనే వాళ్ల శరీరాకృతి ఆధారంగా దేనిలో రాణిస్తారో గుర్తించి వాటిలో శిక్షణ ఇస్తారు. తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలబాలికలకు ఇక్కడ శిక్షణ పూర్తిగా ఉచితం. మిగతావారికి నెలకు రూ.500 ఫీజు చెల్లించి శిక్షణ తీసుకోవచ్చు. వారి సామర్థ్యాన్ని బట్టి ఎంపిక చేసి కేటగిరీల వారీగా శిక్షణ ఇస్తామని శిక్షకుడు సురేష్ తెలియజేశారు. వీరంతా ఒకపక్క చదువుపాటు జిమ్నాస్టిక్స్ శిక్షణలోను పాల్గొంటూ తమ నైపుణ్యాలను చాటుకుంటున్నారు. - ఆంధ్రజ్యోతి/కాకినాడ అర్బన్

జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులతో శిక్షకుడు సురేష్

జాతీయస్థాయిలో రాణించాలని ఆశ



నేను ఐడియల్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. ప్రస్తుతం ఆ పోటీలకు రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి మంచి పేరు తీసుకురావాలన్నదే నా ఆశయం.- జి.కావ్యసాయిశ్రీ

మంచిపేరు తీసుకు రావాలని ఉంది



అది విశాఖ జిల్లా గాజువాక. నేను కాకినాడ శ్రీచైతన్యలో ఇంటర్ చదువుతున్నా. రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించా. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నా. తద్వారా తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉంది.

- హిమవర్షిణి



జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తి



కాకినాడ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచి జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తితో ఇక్కడే శిక్షణ పొందుతున్నా. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నన్ను అందరూ ప్రోత్సహిస్తున్నారు. జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించాలన్నదే లక్ష్యం. - శివగణేష్ వీరబాబు

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



నేను కాకినాడ శ్రీప్రకాష్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో 4 బంగారు పతకాలు సాధించా. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి మంచి ఉద్యోగం సాధించాలనుకుంటున్నా. - మధులత

వయస్సుతో సంబంధంలేని సోరియాసిస్

చర్మంపై ఎర్రటి దద్దుర్లు నిర్లక్ష్యం చేయొద్దు... తగిన జాగ్రత్తలతో అదుపులో వ్యాధి




(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం అర్బన్)

సోరియాసిస్.. వయసుతో సంబంధం లేకుండా ఇది వస్తుంది. దీర్ఘకాలికమైన రోగ నిరోధక శక్తిలో వచ్చే మార్పులతో సోరియాసిస్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యవంతుల్లో చర్మం ఉపరితలం కింద కొత్త కణాలు నిరంతరాయంగా తయారవుతుంటాయి. 24 నుంచి 30 రోజులకు ఇవి బయటకు వస్తాయి. కానీ ఈ వ్యాధి అదుపు తప్పితే చర్మకణాలు మూడు, నాలుగు రోజులకే వేగంగా తయారై బయటకు వస్తాయని, దీనివల్ల చర్మం మందంగా తయారవడంతోపాటు దురద, పొలుసులు ఊడుతాయని చెబుతున్నారు. సోరియాసిస్ ముఖ్యంగా మోచేయి వెనుకభాగం, మోకాలి వెనుకభాగం, తల, వీపు ముఖం, చేతులు, పాదాలకు ఈ వ్యాధి వస్తుంది. సరైన చికిత్స తీసుకోకపోతే దీర్ఘకాలం బాధించే మొండి వ్యాధిగా మారుతుంది. చర్మం ఎర్రగా దద్దుర్లుగా వచ్చి దానిపై తెల్లటి పొట్టుగా వస్తుంది. దీన్నే సోరియాసిస్ అంటారు. సోరియాసిస్‌లో వేర్వేరు రకాలు ఉంటాయి. కొంతమందికి తలలోనే ఉంటుంది. కొంతమందికి శరీరం అంతా వస్తుంది. కొంతమందికి జాయింట్ పెయిన్స్ ఉంటాయి. మరికొంతమందికి పొట్టురాలడం, దురద, జుట్టు రాలడం వంటివి

నేడు సోరియాసిస్ డే

ఉంటాయి. ఇవన్నీ సోరియాసిస్ ప్రథమ లక్షణాలు. కొంతమందిలో చర్మంలో మంటలు, గోకిన కొద్దీ దురద వస్తుంది. మానసిక ఒత్తిడి కూడా దీనికి ఒక కారణమే. జన్యు సంబంధిత లోపాలు కారణం కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే సోరియాసిస్ అంటువ్యాధి కాదు. చాలామందికి దీనిపై దురభిప్రాయం ఉంది. అయితే ఇది బీపీ, షుగర్‌లా ఒక జబ్బు మాత్రమే. సోరియాసిస్‌ను కంట్రోల్ చేయగలం కానీ, పూర్తిగ నయం చేయలేం అని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే దీన్ని అదుపులో ఉంచడానికి చక్కటి మందులు ఉన్నాయి. అదే విధంగా ఒత్తిడిని అధిగమించడం ద్వారా కూడా కొంతవరకు అదుపులో పెట్టుకోవచ్చు.

● **కారణాలు అనేకం..**

ప్రొటీన్స్ తగినంత లేకపోవడం, పౌష్టికాహార లోపం, కొన్ని రకాల సబ్బులు, హార్మోన్ల సమస్యల వల్ల రక్తప్రసరణ తగ్గినప్పుడు, శరీర కణాలకు అవసరమైన ఆహారం లభించకపోవడం, వాతావరణ మార్పులకు శరీరం అలవాటు పడకపోవడం, ఇష్టానుసారం మందులు వాడకం వంటి కారణాలతో సోరియాసిస్ రావొచ్చు. దీన్ని చిన్న జబ్బు అని తీసేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. సరైన నివారణ చర్యలు పాటించడం ద్వారా చాలావరకు ఉపశమనం పొందవచ్చు.

● **అదుపులో ఉంచాలంటే..**

పొడి చర్మానికి ఇంట్లో దొరికే కొబ్బరి నూనె ఎక్కువసార్లు రాసుకోవాల్సి ఉంటుంది. కాళ్లకు సాక్సు వేసుకోవాలి. ఎక్కువ డిటర్జెంట్లు వాడకూడదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సోరియాసిస్‌ను చర్మం, మాడు, గోళ్లు వంటి వాటిని పరీక్షించి నిర్ధారిస్తారు. ఇది దీర్ఘకాలికమైంది.

● **ఏం జాగ్రత్తలు తీసుకోవాలి..**

సోరియాసిస్ తీవ్రతను తగ్గించడానికి టాబ్లెట్లు, క్రీమ్‌లు ఉంటాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో ఒక కోర్సులా వాడాలి. మందులు వేసుకోవడంతోపాటు ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి. పండ్లు, కూరగాయలు, కొవ్వు తక్కువగా, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆకుపచ్చని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఆల్కహాల్ తగ్గించుకోవాలి. ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలి. సోరియాసిస్ కారణంగా హార్టు ఎటాక్, షుగర్ త్వరగా వస్తాయి. ఇది కేవలం స్కిన్ డిసీజ్ అనుకోవద్దు.. మెటబాలిక్ సింగ్రోమ్ అని వైద్యులు స్పష్టంచేస్తున్నారు.



స్వర్ణం కొంటే.. సిరుల పంట!

- నేడు ధనత్రయోదశి.. గోల్డ్ కొనుగోళ్లను ప్రభావితం చేస్తున్న నమ్మకం
- కార్పొరేట్ సంస్థలతో ఉత్తరాది నుంచి వచ్చిన సెంటిమెంట్ ఇది
- అక్షయ తృతీయ, వరలక్ష్మి వ్రతాలకూ మనకు అదే సెంటిమెంటు
- బంగారం ధరలు చూస్తే ఆకాశంలో.. 22క్యా. గ్రాము ధర రూ.7,315

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



పండగలంటేనే అందరికీ సంతోషం. ఆరోజు ఏదొకటి మంచి పనిచేసుకోవాలని భావిస్తుంటారు. పండగలలో ధనానికి సంబంధించిన పండగలంటే మర్చిపోలేని పండగే. దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి అంటే మహిళలకు భలే ఇష్టం. ఈరోజు బంగారం కొనుగోలు చేస్తే రాబోయే రోజుల్లో బాగా ఐశ్వర్యంతో వృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ అక్షయ తృతీయ రోజు బంగారం కొనడానికి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే వరలక్ష్మి వ్రతం రోజున బంగారం కొనుక్కోవాలనే సెంటుమెంటు బాగా ఉంది. కనీసం బంగారపు లక్ష్మీదేవి రూపు అయినా కొనాలని ప్రతి మహిళా ఆరాటపడతారు. గత కొన్నేళ్లుగా బంగారం వ్యాపారం కార్పొరేషన్ సంస్థల చేతులలోకి వెళ్లి పెద్ద షోరూమ్‌లన్నీ నగరాలు, పట్టణాలు, చివరకు గ్రామాల్లోకి కూడా ప్రవేస్తున్న సంగతి తెలిసిందే. ధనత్రయోదశి అనే సెంటిమెంట్‌ను ఈ సంస్థలే తెలుగు ప్రాంతాల్లో విస్తృతవ్యాప్తిలోకి తెచ్చాయని స్థానిక వ్యాపారుల కథనం. ఉత్తరాదిలో ఇటువంటి సెంటిమెంట్ ఎక్కువగా ఉందనేది వారి వాదన. దాంతో ఇక్కడ వ్యాపారం వృద్ధి చెందడం కోసం, ప్రతీ ఒక్కరూ ఏడాదికి కనీసం రెండుసార్లయినా బంగారం కొంటే మంచిదనే సెంట్‌మెంట్ వ్యాప్తి చెందింది. అందుకే ఎండాకాలంలో అక్షయ తృతీయ, దీపావళికి ముందు ధనత్రయోదశి రోజున బంగారం కొనడం ఆనవాయితీగా మారింది. గతంలో ఎప్పుడు డబ్బు ఉంటే అప్పుడు కొనుక్కునేవారు. తర్వాత పండగలు, పెళ్లిళ్ళు, ఇతర శుభకార్యాలకు కొనుగోలు చేసేవారు. ఇక ధనత్రయోదశి, అక్షయ తృతీయ రోజుల్లో కొనుగోలు చేస్తే సంవత్సరం అంతా కొంటామనే సెంటిమెంట్ ప్రచారంలోకి రావడం వల్ల దానిని నమ్మిన ప్రజలు బంగారం కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారు. బంగారం కొనలేని వారు ఏదొక చిన్న వస్తువునైనా కొనుగోలు చేయడం కూడా ఆనవాయితీగా మారిందని చెబుతున్నారు. ఇక ధనత్రయోదశి అంటే ఆయుర్వేద విజ్ఞానానికి ఆరాధ్యం దైవం ధన్వంతరి. ఆయన పుట్టినరోజును ధనత్రయోదశిగా జరుపుకుంటారు. ధన్వంతరిని ధ్యానిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు జీవితకాలం ఉంటాయని చెబుతుంటారు. పైగా ధనత్రయోదశి అనేది కొత్త ధనానికి ఆరంభంగా చెబుతారు. అందువల్ల ఈరోజు కొత్త వస్తువులను కొనుగోలుచేయడం మంచిదంటారు. ఇక ధనత్రయోదశి నాడు లక్ష్మీదేవికి, కుబేరుడు కూడా పూజ చేస్తారు. ఇక బంగారం కొనుగోలు చేస్తే సాక్షాత్తూ మహాలక్ష్మీదేవి ఇంట్లో తరలివస్తుందనేది ఓ సెంటిమెంట్‌గా అందరూ భావిస్తారు. అందుకే ఏదోవిధంగా బంగారం కొనుగోలు చేయడానికి అందరూ ప్రయత్నిస్తారు. వాస్తవానికి ఈ పండుగ హిందువులకు సంబంధించినది అయినా, బంగారం అన్ని వర్గాలు కొనుగోలు చేయడం గమనార్హం. ప్రస్తుతం బంగారం ధరలు ఎక్కువగా ఉండడం వల్ల చాలామంది ఒకే రోజు కొనుగోలు చేసుకోకపోవచ్చు. అందువల్ల చాలా దుకాణాల్లో స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయి. నెలకు ఇంతని చెల్లిస్తే, మొత్తం వాయిదాలు అయిన తర్వాత బంగారం ఇస్తారు. ఒక రూపాయితో డిజిటల్ పేమెంట్ చేసి, ఆయా వ్యక్తుల పేర్ల మీద వాలెట్ ప్రారంభించే అవకాశం కూడా ఉంది.

● **బాగా పెరిగిన బంగారం**

బంగారం అంటే ఇష్టం లేనివారు ఉండరు. ఆడ, మగ తేడా లేకుండా ఎవరైనా బంగారం అంటే ఇష్టపడతారు. బంగారాన్ని కేవలం ధరించడానికే కాకుండా పెట్టుబడిగా కూడా పరిగణిస్తున్నారు. కానీ కొన్ని రోజులుగా బంగారం ధరలు బాగా పెరిగిపోయింది. సోమవారం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.7,315గా ఉంది. ఇది ఆదివారం రూ.7360గా ఉంది. అంటే సోమవారం రూ.45కు తగ్గింది. ఇలా బంగారం ధరలు రోజూ మారుతున్నాయి. అటు 24 క్యారెట్ బంగారం ధర 1 గ్రాము రూ. 7,980గా ఉంది. ఈ నేపథ్యంలో బంగారం కొనుగోళ్లు ఏమేరకు ఉంటాయో చూడాలి.




స్వామివారి కల్పవాహన సేవమహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.. వాడపల్లి బ్రహ్మోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

స్వామివారి తోమాలసేవ

ఎనిమిదవ రోజు బ్రహ్మోత్సవాలలో మహాసుదర్శన హోమం.. ఉభయ దేవేరులతో ఘనంగా కల్పవాహన సేవ

ఆత్రేయపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎనిమిదవ రోజు ఘనంగా జరిగాయి. వేకువజామునే స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, మహస్నపనము, ప్రధాన హోమాలు, మహాసుదర్శన హోమం నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తోమాల సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు - కనకదుర్గా దంపతుల మీదుగా నిర్వహించారు. ఉదయం శ్రీవారు ఉభయదేవేరులతో కల్పవృక్ష వాహన సేవను కేరళ వాయిద్యాలు, అశేష భక్తజన గోవిందనామస్మరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదపండితులు చూర్ణోత్సవ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, భరతనాట్యం, కోలాట ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వవాహనంపై కొలువుతీరారు. వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ అశ్వవాహన సేవ కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీవారు తిరువీధులలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శ్రీవారి వాహన సేవలో పాల్గొన్నారు. విద్యుత్ వెలుగులు, బాణసంచా కాల్పుల నడుమ వాహనసేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం- మంగాదేవి దంపతులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం స్వామివారికి మహాపూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం సాయంత్రం, మహాఆశీర్వచనం రాత్రి ఏకాంత సేవతో స్వామివారి వారిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఉపకమిషనరు చక్రధరరావు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.



స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకం



వసంతం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు దాడికి పాల్పడడంతో పోలీస్ స్టేషన్ వద్ద గుమిగూడిన జనం

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ దౌర్జన్యం

టార్పాలిన్ కప్పకుండా ఇసుక రవాణా.. ఆపై అతివేగం

ప్రశ్నించిన ద్విచక్రవాహదారుడిని ట్రాక్టర్‌తో ఈడ్చుకెళ్లిన డ్రైవర్

సీతానగరం, అక్టోబరు 28: టార్పాలిన్ లేకుండా, అధిక వేగంగా నడపడమేంటని ప్రశ్నించిన ద్విచక్రవాహనదారుడిపై ట్రాక్టర్ డ్రైవర్ అమానుషంగా ప్రదర్శించాడు. అతడిని ట్రాక్టర్‌తో సహా ఈడ్చుకెళ్లాడు. స్థానికులు రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. సీతానగరం గ్రామానికి చెందిన కోడేబత్తుల జగన్ మోహన్‌రావు రాత్రి 7.15ని ప్రాంతంలో తన సొంతూరైన రామచంద్రపురం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. డిగ్రీ కళాశాల వద్దకు వచ్చేసరికి అధిక వేగంగా గుంతలు కూడా చూడకుండా ఒక ఇసుక ట్రాక్టర్ వెళుతోంది. టార్పాలిన్ లేకపోవడంతో ఇసుక గతుకులకు ఎగిరి వెనుక వస్తున్న వాహనదారులపై పడుతోంది. తనపై కూడా పడడంతో సహనం కోల్పోయిన జగన్‌మోహన్‌రావు ట్రాక్టరు ఆపి టార్పాలిన్ కూడా లేకుండా అంత స్పీడ్ ఎందుకు వెళ్తున్నారు? ఇసుక కళ్లల్లో పడుతోందని నిలదీశాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ 'ఇది నా సొంతూరు, నేను ఏం చేసినా అడిగేవాడు లేడు అంటూ దౌర్జన్యానికి దిగాడు. వెనుక వస్తున్న మరికొన్ని ట్రాక్టర్ల డ్రైవర్లు కూడా అడ్డువస్తే మీద నుంచి పోనిస్తామంటూ బెదిరించి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే జగన్ మోహనరావు ఆపిన ట్రాక్టర్ డ్రైవర్ అతడిని తోసుకుంటూ ముందుకు పోనిచ్చాడు. దీంతో చేసేది లేక జగన్‌మోహనరావు ట్రాక్టరుకు వేలాడాడు. అయినా ఆపకుండా పోనిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు చూసి ఆపారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆయన సీతానగరం పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాగా ఇటీవల ట్రాక్టర్ డ్రైవర్లకు, యజమానులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. అయినప్పటికీ వాటిని ట్రాక్టర్ డ్రైవర్లు బేఖాతరు చేస్తున్నారు. తహశీల్దార్ సర్వేచేసి మక్కుల వేసిన చోట తవ్వకాలు జరపాలని, మంగళవారం నుంచి ఇసుక తోలుకోవచ్చని ఎమ్మెల్యే చెప్పినా సోమవారం రాత్రి నుంచి విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. పైగా డ్రైవర్లు కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు స్పందించి వీరిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.


సూర్యకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

స్వగ్రామంలో 'గయ్యాళి అత్త' సూర్యకాంతం జయంతి

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి, గయ్యాళి అత్తగా పేర్గాంచిన సూర్యకాంతం జయంతిని ఆమె స్వగ్రామమైన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు వృద్ధుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సూర్యాకాంతం చిత్రపటానికి ఇన్‌చార్జి సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేళ్ల క్రితం జన్మించి చలన చిత్ర రంగంలో విశిష్ట స్థానం సంపాదించుకుని తమ గ్రామానికి ఎంతో ప్రాధాన్యం తెచ్చారన్నారు. నానాజీ, మలిరెడ్డి సూరిబాబు, మసిముక్కల ప్రసాద్, ఇమ్మిడిశెట్టి సూర్యనారాయణ, గంగాబత్తుల బాబులు, పంచాయతీ కార్యదర్శి శేఖరరెడ్డి, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

రూ.2 లక్షలు విలువైన మందుగుండు సామగ్రి స్వాధీనం

రాజానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన దీపావళి మందుగుండు సామగ్రిని రాజానగరం పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు శానిటోరియం సమీపంలో జనావాసాల చెంతన రూ.2 లక్షలు విలువైన దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. సంబంధిత యజమాని లైసెన్సు కలిగి ఉన్నాడు. అయితే జనావాసాల్లో ప్రమాదకరంగా భావించి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని రాధేయపాలెం సమీపంలోని గొడౌన్‌కు తరలించామని రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ చెప్పారు. యజమానికి నోటీసు జారీ చేసినట్టు ఎస్ఐ మనోహర్ వివరించారు.


పవిత్రాలను తీసుకొస్తున్న సహాయ కమిషనరు సత్యనారాయణరాజు, ఉత్సవాల విశిష్టతను వివరిస్తున్న అర్చకస్వామి, శాంతి కల్యాణం

అప్పనపల్లిలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలతిరుపతిగా పేర్గాంచిన అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం తొలి హారతి ఇచ్చారు. అనంతరం ఉభయ దేవేరులకు సహస్రధార అభిషేకం, చతుస్థానార్చనలు, పవిత్ర అవరోహణం, వైకుంఠ పాశ్వ హవనం, మహా పూర్ణాహుతిలను వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు పవిత్రాలను శిరస్సున పెట్టుకుని తోడ్కొని వచ్చారు. స్వామివారికి ఏకాదశ ఫలరస స్నపన సహిత అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనాన్ని ఘనంగా జరిపారు. కంచి కామకోటి పీఠం నాదస్వర పాఠశాల విద్యార్థుల నాదస్వర స్వరార్చన భక్తులను ఆకట్టుకుంది. రాత్రి శ్రీపుష్పయాగం, మహదాశీర్వచనం, రుత్వికులకు సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. పవిత్రోత్సవాలు నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాలను, శాంతి కల్యాణం విశిష్టతను అర్చకులు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రాణాలు తీసిన అతి వేగం

డివైడర్‌ని ఢీకొట్టి ఇద్దరు యువకుల మృతి

కాకినాడ రూరల్ రమణయ్యపేట మార్కెట్ సమీపంలో దుర్ఘటన


డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందిన హరిబాబు, అభినంద్ (పాత చిత్రాలు)

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28: వారిద్దరూ స్నేహితులు... ఒకరు తండ్రి మృతి చెందగా అన్నీ తానై తల్లి రెక్కల కష్టంతో ఇంటర్ దాకా చదివి ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మరొకరు డిగ్రీ పూర్తి చేసి తండ్రి స్వీట్స్ వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు. మేనకోడలు పుట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని స్నేహితులకు పార్టీ ఇచ్చి ఆనందంగా గడిపిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో మితిమీరిన వేగంతో బైక్ నడపడంతో వేగాన్ని నియంత్రించలేక అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ని ఢీకొన్నారు. ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి సర్పవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...

కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన పాలపర్తి అభినంద్ (20), మజ్జి హరిబాబు (20) స్నేహితులు. మేనకోడలు పుట్టిన ఆనందంలో అభినంద్ ఆదివారం రాత్రి ఏపీఐఐసీ కాలనీలో సుమారు 10 మంది స్నేహితులకు పార్టీ ఇచ్చాడు. రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకు ఆనందంగా గడిపారు. అ తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అభినంద్, హరిబాబు స్నేహితుడి బైక్‌పై గంగరాజునగర్ నుంచి సర్పవరం జంక్షన్ వైపు బయల్దేరారు. రమణయ్యపేట మార్కెట్ సమీపంలోని శ్మశానవాటిక వద్దకు వచ్చేసరిగా వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ని ఢీకొట్టారు. ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర రక్తస్రావంతో హరిబాబు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అభినంద్‌ను సమీపంలోని సిటీ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మేనకోడలు పుట్టిందన్న ఆనందంలో బయటకు వెళ్తున్నామని చెప్పిన తన కుమారుడికి ఇలా జరిగిందంటూ అభినంద్ తండ్రి త్రిమూర్తులు, కుటుంబ సభ్యులు రోదించాడు. తండ్రి మృతితో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో చేతికి అందివస్తాడనుకుంటున్న క్రమంలో ఇలా మృతి చెందడంతో హరిబాబు తల్లి కన్నీరుమున్నీరైంది.

విషయం తెలిసిన వెంటనే సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. అభినంద్ అన్నయ్య శివసత్యసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలకు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మద్యం మత్తులో వేగాన్ని నియంత్రించలేకే డివైడర్‌ని ఢీకొట్టి యువకులు మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడేవారంటున్నారు.


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కాకినాడ అర్బన్, అక్టోబరు 28: రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగాల్లో 68వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తుండగా వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోటీలను డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌కుమార్, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజు, టీపీఎస్ రంగారావు, ఎస్‌కే బాబు, జి.సునీల్ పాల్గొన్నారు.


అరెస్టు చేసిన వారి వివరాలు తెలుపుతున్న పిఠాపురం సీఐ, ఎస్ఐ... స్వాధీనం చేసుకున్న గంజాయి

ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా

పిఠాపురం, అక్టోబరు 28: ఏజెన్సీ నుంచి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు స్వాధీనం చేసుకుని, నలుగురు యువకులను అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ వెల్లడించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి నర్సీపట్టణం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారంతో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, పోలీసులు పిఠాపురం బైపాస్‌లో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రాపర్తి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా... రాపర్తి గ్రామం వైపు నుంచి పల్సర్ బైక్‌పై ఒక వ్యక్తి పైలట్‌గా, వెనుక ఆటో వస్తుండగా పోలీసులను చూసి పరారయ్యే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని ఆటోలో తనిఖీ చేయగా మూటల్లో ఉన్న 88 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠరాజు (23), అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీ కుడుములు గ్రామానికి చెందిన గబులంగి మునిరాజు (20), కోరుకొండ గ్రామానికి చెందిన మామిడి సన్యాసిరాజు (23), చౌడపల్లి పంచాయతీ ఈదులబయలు గ్రామానికి చెందిన కొర్రా రాము(20)లను అరెస్టు చేశారు. గంజాయితో పాటు బజాజ్ పాసింజర్ ఆటో, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు.

88 కిలోలు స్వాధీనం...

నలుగురు యువకులు అరెస్టు

సెంట్రింగ్ పనులకు వెళ్లి...

గంజాయి స్వాధీనం ఘటనలో ప్రథమ నిందితుడైన మణికంఠరాజు ఏజెన్సీ చింతపల్లి చుట్టపక్కల ప్రాంతాల్లో సెంట్రింగ్ పనులను చేస్తూ అక్కడ గంజాయి అమ్మేవారితో పరిచయాలు పెంచుకున్నాడు. గంజాయి కొనుగోలు చేసి చుట్టపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తూ వ్యాపారం సాగిస్తున్నాడు. ఇదే రీతిలో ఏజెన్సీలోని కొందరు యువకులతో ముఠాగా ఏర్పడి కొంతకాలం గం జాయి అక్రమ రవాణా నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మణికంఠ రాజుపై సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్, గాజువాక ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నాయి.


పులి రోడ్డుపైకి వచ్చిన అటవీ మార్గం ఇదే...

మన్యం పులి

రోడ్డు దాటుతుండగా చూసిన వీఆర్ పురం వాసి
వివరాలు సేకరిస్తున్న అటవీ, పోలీసు అధికారులు
భయందోళనలో కూనవరం మండల ప్రజలు

కూనవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూనవరం మన్యంలో అడుగుపెట్టిన పులి అటు అధికారులకు, ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గిరిజన గ్రామాల ప్రజలు సాయంత్రం ఆరు అయ్యిందంటేనే భయాందోళన చెందుతున్నారు. ఆదివారం లింగాపురం పరిధిలో వీఆర్ పురం వాసులకు పులి ప్రత్యక్షంగా కనిపించడంతో ఈ భయం మరింత ఎక్కువైంది. పులిని చూసిన వీఆర్ పురానికి చెందిన బొర్రా సూరిను అటు పోలీసులు, ఇటు అటవీ శాఖాధికారులు పిలిపించి పులి ఆచూకీ వివరాలు తెలుసుకున్నారు. తాను కారులో వస్తుండగా పులి రోడ్డు దాటి అడవిలోకి వెళ్లినట్టు సూరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. గత కొన్ని రోజులుగా పులి కూనవరం రేంజ్ పరిధిలోనే తిరుగుతోంది. ఇటీవల రెండు పశువులపై దాడి చేసింది. మొదటి దాడిలో ఓ లేగదూడను చంపి రక్తం తాగి వదిలేసి వెళ్లిపోయింది. రెండవ దాడిలో మరో పశువును చంపి పూర్తిగా తినేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరోసారి రాత్రి వేళలో కూనవరం-చింతూరు మధ్య రాకపోకలను నిలిపివేశారు. అటు పోలీసులు, ఇటు అటవీ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు.


పులిని చూశానని చెప్తున్న సూరి

రాత్రివేళ బయటకు రావద్దు

డీఎఫ్‌వో బబిత



పులి సంచరిస్తోందన్న ప్రచారం నేపథ్యంలో రాత్రివేళ ప్రజలెవరూ బయటకు రావొద్దు. పులి అడుగుజాడలు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వడం. పులి కనిపిస్తే వీడియోలు కానీ, ఫొటోలు కానీ తీయొద్దు. రాత్రివేళ ప్రయాణాలు చేయవద్దు. రైతులకు రాత్రిళ్లు ఇచ్చే వ్యవసాయ కరెంటును నిలిపివేసి పూర్తిగా పగలు ఇచ్చేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

పులి దాడి ప్రచారం అవాస్తవం

వదంతులు నమ్మొద్దు: సీఐ కన్నపరాజు

ఎటపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం లింగాపురం సమీపంలో రహదారిపై చింతూరు నుంచి కూనవరం వస్తున్న కారుపై పులి దాడి చేసిందనే ప్రచారం అవాస్తవమని సీఐ కన్నపరాజు పేర్కొన్నారు. పులి కారుపై దాడి చేసిందనే వదంతులపై ఆయన స్పందిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పులి రహదారి పక్కన అరుస్తూ కన్పించిందని, కారుపై ఎటువంటి దాడి చేయలేదన్నారు. తప్పుడు వదంతులతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయందోళన చెందుతున్నారన్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత బయటకు రావద్దని, పులి సంచారం ఉన్న ప్రాంతాలకు పశువులను మేతకు తోలుకెళ్లొద్దని కూనవరం మండల ప్రజలకు సూచించారు. వేటగాళ్లు అటవీలోకి వెళ్లవద్దని సూచించారు. అటవీశాఖ అధికారులు పులి కదలికలపై దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారని చెప్పారు.


క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం అక్రమ నిల్వలు

ప్రిన్సిపాల్ సలోనిపై సస్పెన్షన్ వేటు

రాజవొమ్మంగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రభుత్వ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ క్వార్టర్స్‌లో 1,700 కిలోల బియ్యం బయటపడ్డ ఘటనలో ప్రిన్సిపాల్ సలోనిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 24వ తేదీన ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కళాశాలను తనిఖీ చేసిన సమయంలో బియ్యం అక్రమ నిల్వలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి వచ్చి ప్రాథమిక దర్యాప్తు చేసి నివేదికను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి ఇచ్చారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడమే కాక విద్యార్థులతో బియ్యం బస్తాలు మోయించినందుకు ప్రిన్సిపాల్ సలోనిని సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఫోనులో ఫిర్యాదు చేయడం, డిప్యూటీ డైరెక్టర్ ప్రాథమిక దర్యాప్తు నివేదిక మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచడం, సిబ్బంది సహకరించారా..? తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి 10 రోజుల్లో నివేదిక ఇచ్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజును విచారణ అధికారిగా నియమించినట్టు పీవో చెప్పారు.

34 బియ్యం బస్తాలను విద్యార్థినులతో మోయించి వారిని బానిసలుగా మార్చిన ప్రిన్సిపాల్ సలోనిపై శాఖాపరమైన చర్యలతో సరిపెట్టడం సరికాదని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, కలెక్టర్ మహేష్‌కుమార్

క్రీడలతో పోటీతత్వం

అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభ సభలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

మలికిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక ఉత్తేజం పొందడంతో పాటు పోటీతత్వం అలవరచుకునేందుకు దోహదపడతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, పాఠశాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. పాఠశాల విద్యా శాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్- 14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంటను సోమవారం ఆయన మలికిపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కోరిన విధంగా మండలానికి పది ఆట స్థలాలను గుర్తించి ఉపాధి హామీ అనుసంధానంతో అభివృద్ధి చేస్తామన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడా వసతుల కల్పన దిశగా కృషి చేస్తానన్నారు. అమలాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. విజేతలుగా నిలిచిన అండర్-14 నుంచి ఐదుగురు బాలబాలికలను, అండర్-17 నుంచి ఐదుగురు బాలబాలికలను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ముందుగా జాతీయ గేమ్స్ ఫెడరేషన్ జెండాను కలెక్టర్, రాష్ట్ర గేమ్స్ ఫెడరేషన్ జెండాను ఎమ్మెల్యే, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ జెండాను ఉప విద్యాశాఖాధికారి ఆవిష్కరించారు. క్రీడాజ్యోతి ర్యాలీని మలికిపురం గాంధీబొమ్మ సెంటర్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ఎమ్మెల్యే తీసుకువచ్చారు. కార్యక్రమంలో శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ దెందుకూరి రాంబాబురాజు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తి, క్రీడా శాఖ కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, ఎంఈవో ఎం.విజయశ్రీ, జాన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

'ప్రణాళికలు రూపొందించుకోవాలి'

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి అభివృద్ధి జరగాలన్నా ముందుగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని ఈటీసీ ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలకు చెందిన డీపీఎంలు, ఎంపీడీవోలు, డ్వామా పీడీలు, సీఈవోలు, డీఆర్‌డీఏ పీడీలు, ఈవోపీఆర్డీలకు రెండో బ్యాచ్ శిక్షణ తరగతులు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఏపీఎస్ఆర్డీ జాయింట్ డైరెక్టర్ రమణ, డీఎల్డీవో కేఎస్ఎన్ ప్రసాద్.. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. సుమారు 130 మంది అధికారులు హాజరు కాగా వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు ఆంజనేయులు, శ్రీనివాసరావు, చక్రపాణి, నిహారిక వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు.

రేపు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కిస్తామని అన్నవరం దేవస్థానం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విధులు కేటాయించిన సిబ్బంది డ్రెస్‌కోడ్‌తో పాల్గొనాలని కోరారు. నవంబరు 2న కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో కార్తీక మాస ఆదాయం ప్రత్యేకంగా నెలలో రెండు పర్యాయాలు లెక్కిస్తారు.

2న రాజమహేంద్రవరంలో

ఉమ్మడి జిల్లా మాదిగ, ఉప కులాల సదస్సు

కాకినాడ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న రాజమహేంద్రవరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాదిగ, ఉపకులాల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతవరపు రాజు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిరాజు అన్నారు. కాకినాడలో సోమవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీతో పాటు వివిధ రాజకీయల పార్టీల నేతలు హాజరయ్యే మాదిగ, ఉప కులాల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాల పర్యటనలో భాగంగా కృష్ణమాదిగ ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయమని, కూటమి ప్రభుత్వం వర్గీకరణ అనుకూలంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.నూకరాజు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరమణ, నాయకులు మిరియాల వీరబాబు, ఎం.వెంకట్రావు, డేవిడ్‌రాజు, ఆరుగొల్లు పండు, రవికుమార్ పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్యను హతమార్చిన ఘటనలో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పెద్దాపురం జడ్జి చంద్రమౌళేశ్వరి సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామంలో 2014లో కూనిశెట్టి సుజాత, ఆమె భర్త అప్పారావు మధ్య తగాదాలొచ్చాయి. భార్య మెడకు అప్పారావు చున్నీ బిగించి హత్య చేశాడు. దీనిపై అప్పటి ఎస్ఐ వై.రవికుమార్, సీఐ సత్యనారాయణ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలతో చార్జ్ షీట్ దాఖలుచేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులను విచారించారు. అప్పారావుకు యావజ్జీవ కారాగారంతో పాటు అదనంగా 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూటర్‌గా కె.మృత్యుంజయరావు వాదనలు వినిపించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ బి.లక్ష్మీకాంత్... కేసు తుది తీర్పు వెలువడే వరకు దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు.

కూటమికి వ్యతిరేకంగా వ్యవహరించొద్దు

- అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని ప్రభుత్వ శాఖల్లో హెచ్‌వోడీల మార్పులు జరిగాయన్నారు. ఇంకా క్షేత్రస్థాయిలో గత వైసీపీ వారితో అంటకాగిన వారు ఎవరైనా ఉంటే వారు మారాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వ మాదిరి అందరిని గాలికొదిలేసే ప్రభుత్వం తమది కాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేదే కూటమి ప్రభుత్వమన్నారు. జగన్ రాష్ట్రానికి చేసిన మంచి లేదు కాని రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశాడని మండిపడ్డారు. ఎన్నికల హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఈ దీపావళికి నేరవేస్తున్నామని చెప్పారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు గ్యాస్ బుకింగ్ చేసుకుని ఇంటికి వచ్చాక డబ్బులు చెల్లించే 48గంటల్లో మీ బ్యాంకు అకౌంట్‌లో నగదు జమవుతుందన్నారు. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయాలన్నారు. ఇచ్చిన ప్రతిహామీ నేరవేరుస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, చాం బర్ అధ్యక్షుడు తవ్వా రాజా, అడబాల రామకృష్ణారావు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, మరుకుర్తి రవియాదవ్, శెట్టి జగదీష్, ఉప్పులూరి జానకిరామయ్య పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక'ను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే బత్తుల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఉచిత ఇసుక విధానంలో ఏవిధమైన అనుమానాలకు తావులేదని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు నిర్ణయించిన చోట ఇసుక పూర్తిగా ఉచితమన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా ట్రాక్టర్లపై ఇసుక తీసుకుని వెళ్ళవచ్చునని చెప్పారు. దీనికి ఏవిధమైన ఆటంకాలు లేవని అయితే ఏ మండలం నుంచి వస్తున్నారో ఆ మండలంలోని తహశీల్దార్ లేదా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల నుంచి స్లిప్‌లు తీసుకుని నేరుగా ఇసుక ర్యాంపులోకి వెళ్లి ఇసుక లోడింగ్ చేసుకుని తీసుకుని వెళ్ళవచ్చునన్నారు. ఇసుక ట్రాక్టర్లు ఖచ్చితంగా డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు కలిగివుండాలని, ఇసుకపై టార్పాలిన్లు కప్పి రవాణా చేయాలన్నారు. మద్యం తాగి, అధిక వేగంగా ట్రాక్టర్లు నడిపితే సీజ్ చేస్తామన్నారు. ఉదయం 6గం. నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణా చేసుకోవచ్చునన్నారు. ఉచిత ఇసుక ద్వారా టాక్టర్లకు, కూలీలకు, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించినట్టు అవుతుందన్నారు.

అసమానతలు, వివక్షతపై విద్యార్థులు పోరాడాలి

పీడీఎస్‌యూ 50 వసంతాల మేఘగర్జన సభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న ఆదికవి నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలోని అసమానతలు, వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఆదికవి నన్నయ వర్శిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా అన్నారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్ ఆనం రోటరీ హాలులో సోమవారం నిర్వహించిన పీడీఎస్‌యూ 50 వసంతాల మేఘ గర్జన జాతీయ సభలో సంఘ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ బిగి పిడికిలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం హృదయరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ 1974లో ఉస్మానియా యూనివర్శిటీ వేదికగా పీడీఎస్‌యూ ఏర్పడిందన్నారు. మనుషులందరికీ ఒకే రకమైన సమానమైన శాస్త్రీయ విద్యావిధానం కావాలని పీడీఎస్‌యూ తన లక్ష్యంగా ఎంచుకొందని, దీని కోసమే పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు విజయ్‌కన్నా, తెలంగాణ రాష్ట్రాధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్రాధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్రాధ్యక్షుడు టి.ప్రకాష్, పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో చురుకుగా ఉండాలి

- టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి


నరేంద్రపురం టీడీపీ నాయకులతో చర్చిస్తున్న బీవీఆర్ చౌదరి

రాజానగరం/కోరుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు చురుకుగా వ్యవహరించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పిలుపునిచ్చారు. రాజానగరం మండలం నరేంద్రపురం, కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ఇప్పటి వరకు చేపట్టిన సభ్యత్వ నమోదు వివరాలను చిట్టిప్రోలు పద్దరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు నిరంతర ప్రక్రియ అని, ఆయా గ్రామాల ఓటర్ల జాబితాల మేరకు కనీసం 30శాతం తగ్గకుండా సభ్యత్వ నమోదు విధిగా చేయాలని సూచించారు. మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు క్లస్టర్లలో ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేసే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, చిట్టిప్రోలు సాగర్, సుంకర అరుణకుమార్, నక్కిన శ్రీను, రొంగల దేవిక, శ్రీనివాసు, కంటే నాగేశవరావు,మార్ని రాము, పాల్గొన్నారు.

కమిషన్ తగ్గింపు నిర్ణయం ఉపసంహరించాలి

- ఆలిండియా లిపియా అధ్యక్షుడు మాధవరావు
- ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా


మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల కమిషన్ తగ్గింపు నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలిండియా లిపియా అధ్యక్షుడు రావుల మాధవరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా చేశారు. ఉద్యమం ప్రారంభించి 15 రోజులు అవుతుందని, యాజమాన్యంతో చర్చలు సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఏజెంట్ల డిమాండ్ల ను న్యాయబద్ధంగా నేరవేర్చాలన్నారు.రూరల్ బ్రాంచ్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబు మాట్లాడుతూ డిమాండ్లు నేరవేర్చకపోతే రోడ్డెక్కుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఐ.చంద్రశేఖర్, యార్నాకుల రామ్మోహన్, రవి, మట్టా సత్యనారాయణ, ఏజెంట్లు రాయుడు గంగారావు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సత్కారం



రాజానగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘ కాలంగా సేవలందించిన కానిస్టేబుళ్లు ఎట్టకేలకు మూకుమ్మడిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆత్మీయ వీడ్కోలు సభ సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు అధిక ఒత్తిడులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వాటిని అధిగమిస్తూ, అంకితభావంతో పనిచేయాలన్నారు. దీనిలో భాగంగా బదిలీపై వెళ్తున్న ఒక ఏఎస్ఐతో పాటు 20 మంది కానిస్టేబుల్స్‌ను ఎస్.ఐలు మనోహర్, నాగార్జునలతో కలిసి సీఐ సత్కరించి, యూనిఫారాలు అందజేశారు. ఇదిలా ఉండగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇంత మంది ఒకే సారి బదిలీలు కావడంపై ఇటీవల కదలరు..వదలరు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనమే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో.. భయం..భయం..


రైల్వే క్వార్టర్లలో నాచుపట్టిపోయిన భవనాలు

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా పాడుబడిన భవనాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- గోడ దూకొచ్చి గంజాయి కాలుస్తున్న.. జూనియర్ కళాశాల విద్యార్థులు
- పెచ్చులూడిపోతున్న స్లాబులు
- ఆందోళనలో నివాసితులు
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైల్వే గూడ్స్ షెడ్ ఎదురుగా ఉన్న గంగాయమున రైల్వే క్వార్టర్లలోని కుటుంబాలు భయభయంగా రోజులు గడుపుతున్నాయి. ఎప్పుడు ఏ గంజాయి తాగిన వ్యక్తి ఇళ్లలోకి చొరబడతాడో.. ఎప్పుడు పెచ్చులు ఊడి నెత్తిమీద పడతాయో తెలియని దుస్థితిలో బతుకుతున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తొలుతగా కనిపించే నివాసాలకు సున్నం వేసి మమ అనిపిస్తున్నారు. ఆ వచ్చిన అధికారులు కూడా క్వార్టర్లను పూర్తిగా పరిశీలన చేయకుండానే నాలుగు అడుగులేసి వెనుదిరుగుతున్నారు. కనీసం ఏసీ ఏర్పాటుకు కూడా అనుమతులు లేకపోవడంతో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు వృద్ధులు, వ్యాధిగ్రస్తులు అల్లాడిపోతున్నారు. ఈ రైల్వే క్వార్టర్లను దశల వారీగా 1980కి నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం మొత్తం 47 క్వార్టర్లకుగాను 36 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడకు రావడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నా కనీస భద్రత లేకపోవడంతో భయభయంగా ఉండలేక భారమైనప్పటికీ ఎక్కువ అద్దెలు చెల్లించి బయట నివాసం ఉంటున్నారు.

విద్యార్థులు గంజాయి కాలుస్తూ..

ఇక్కడ క్వార్టర్లకు వెనుక వైపున గోదావరి గట్టు అనుకొని ఉంటుంది. అక్కడ ఏలాంటి రక్షణ కంచె, ప్రహరీ లేదు. దీంతో అసాంఘిక వ్యక్తులు మద్యం సీసాలతో గట్టుదిగి నేరుగా పాడుబడిన క్వార్టర్లలోకి వెళ్లి అర్ధరాత్రుల వరకూ మందు తాగుతూ, గంజాయి కాలుస్తున్నారని, పగటివేళ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు గోడ దూకి వచ్చి గంజాయి తాగుతున్నారని నివాసిత మహిళలు చెబుతున్నారు. ఈ విషయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కి చెప్పినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైక్‌లు వేసుకుని వేగంగా వస్తున్న యువకులు తరగతి గదుల్లో కిటికీల వద్ద కూర్చున్న బాలికలకు సైగలు చేస్తూ అల్లరి సృష్టిస్తున్నారని.. మందు తాగిన వాళ్లు, గంజాయి కాలుస్తున్న వాళ్లలో బ్లేడ్ బ్యాచ్‌లు కూడా ఉన్నాయని అనుమానంగా ఉందంటున్నారు. గోదావరి గట్టుకు అభిముఖంగా ఉండే నివాసం అరుగుపై ఒక్కోసారి తాగిన వాళ్లు ఒంటిపై దుస్తులు కూడా లేకుండా దొర్లుతున్నారని.. ఇలాంటి పరిస్థితుల వల్ల మహిళలు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని చెబుతున్నారు. ఒక్కోసారి పురుషులపైకి కూడా ఆ అల్లరి మూకలు దూకుడుగా వచ్చి దాడికి ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు.


రాజమహేంద్రవరం రైల్వే క్వార్టర్లలో శిథిలావస్థకు చేరిన భవనాలు

అన్నీ మరమ్మతులే..

ఈ రైల్వే క్వార్టర్లలో కొన్ని ధ్వంసమయ్యాయి. సినిమాల్లోని భూతాల కొంపలను తలపిస్తున్నాయి. వీటి పక్కన కూడా ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం నివాసితులు ఉంటున్నవి కూడా ఎప్పుడూ మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. స్లాబులు పెచ్చులు ఊడిపోతున్నాయి. ఏ గోడ ఎప్పుడు కూలుతుందో తెలియదు. వర్షం వస్తే ఇంట్లో గోదావరి మాదిరిగా నీళ్లు చేరుతున్నాయి. వాటర్ ట్యాంకులు నాచుపట్టిపోయాయి. వైరింగ్ ఎప్పటిదో కావడం, సవ్యంగా లేకపోవడంతో ఏసీ ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఈ ప్రాంతంలోని చెత్త కుండీల్లోని వ్యర్థాలను రోజుల తరబడి తరలించకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిలేకపోవడంతో దోమలతో రోజూ యుద్ధం చేయక తప్పని పరిస్థితి ఉంది. రోగాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు వస్తున్న సమయంలో గేటు(ఇదీ ధ్వంసమైంది) దాటిన వెంటనే ఉండే రెండు బ్లాకులకు మాత్రం సున్నం వేసి చూపిస్తున్నారు.

ఇదీ విన్నపం

పగటి పూట కూడా భద్రత లేకపోవడంతో నైట్ డ్యూటీలకు వెళ్లే ఉద్యోగుల కుటుంబీకులు అత్యవసరానికి కూడా బయటకు రాలేకపోతున్నారు. డ్యూటీ ముగించుకొని రాత్రి వేళల్లో ఇళ్లకు వచ్చే ఉద్యోగులు కూడా క్షేమంగా ఇంటికి చేరతారన్న భరోసా లేదు. ఇక్కడ ధ్వంసమైన క్వార్టర్లను బాగు చేయాలని, క్వార్టర్ల చుట్టూ ప్రధానంగా గోదావరి గట్టువైపు ప్రహరీ నిర్మించడంతోపాటు ప్రవేశం వద్ద గేటు పెట్టాలని నివాసితులు కోరుతున్నారు. అలాగే ఏసీల ఏర్పాటుకు అనుకూలంగా వైరింగ్ మార్పు చేయాలని కోరుతున్నారు. ఏదేమైనా.. ఏదోక ప్రమాదం జరిగే వరకూ వేచి చూడకుండా తగిన విధంగా తక్షణమే అధికారులు స్పందించాల్సిన అవసరత కనిపిస్తోంది.

కలెక్టరేట్‌లో విజిలెన్స్ డే ప్రతిజ్ఞ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో విజిలెన్స్‌డే ను పురస్కరించుకుని జేసీ చిన్నరాముడు సోమవారం ఉదయం జిల్లా అధికారులతో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో తామరాల సీతారామమూర్తి, పర్యాటకశాఖ ఆర్‌డీ స్వామి నాయుడు, వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశద్రోహం పేరుతో ప్రొఫెసర్ సాయిబాబాను పదేళ్లు జైలులో బంధించి అతని ప్రాణాలు తీశారని దివ్యాంగ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు యనమదల వెంకటేశ్వరరావు అన్నారు. వేమగిరి దివ్యాంగుల ప్రాంగణంలో సోమవారం దివ్యాంగ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలిమాటి రాంబాబు,ఉభయ జిల్లాల అధ్యక్షుడు అంకం గంగరాజు, అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, గుత్తుల ఉమాదేవి, వరలక్ష్మి, జి.విజయ, కర్రి చంద్రమౌళి పాల్గొన్నారు.

జేగురుపాడులో
రెవెన్యూ గ్రామసభ

కడియం, అక్టోబరు 28: మండలంలోని జేగురుపాడులో సోమవారం రెవెన్యూ గ్రామ సభ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. డిప్యూటీ తహసీల్దారు మహాలక్ష్మికి రైతులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. గ్రామంలో ఉన్న పడాల చెరువును ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ లీజుకు తీసుకుని చేపల పెంపకం చేపడుతోందని, 40 ఏళ్లుగా చెరువును ఆక్రమించుకుని నిర్మాణం చేస్తున్నారని, దీనిపై సర్వే నిర్వహించాలని సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. 54 దరఖాస్తులు రాగా అందులో 44 భూమి తక్కువగా ఉందని వచ్చినవే. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, వీఆర్వో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దేవిన సిస్టర్స్‌కు
ఎస్పీ కిషోర్ అభినందన

రంగంపేట, అక్టోబరు 28: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఇటీవల రంగంపేటలో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత 'మరువలేనిది మీ త్యాగం' అనే నినాదంతో సైకత శిల్పం రూపొందించారు.అందుకుగాను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ సోమవారం రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయంలో దేవిన సిస్టర్స్‌ని అభినందించారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగం సంపాదించుకోవాలని ఆకాంక్షిస్తూ ఎస్ఐ తోట కృష్ణసాయి అందజేసిన గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలను బహూకరించి శాలువాతో సత్కరించారు.

వేంకటేశుడి హుండీ లెక్కింపు

పెరవలి, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 32 రోజులకు ప్రధాన హుండీ ద్వారా రూ.2,53,517, అన్నదాన హుండీ ద్వారా రూ.5,073 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు.

రహదారులను విశాలంగా తీర్చిదిద్దాలి

- కమిషనర్ కేతన్ గార్గ్
- రాజమహేంద్రవరంలో పలు కూడళ్ల పరిశీలన


కూడళ్ళు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాల 2027ను పురస్కరించుకుని నగరంలో రహదారులు విశాలంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో కోరుకొండ రోడ్డు, తూర్పురైల్వే స్టేషన్ కూడళ్ళను సోమవారం పరిశీలించారు. రహదారుల విస్తరణ ప్లాన్లను తిలకించారు. పుష్కరాలకు రైల్వేస్టేషను తూర్పువైపున కూడా నూతన ప్లాట్‌ఫాంలు వచ్చే అవకాశం ఉన్నందున మోరంపూడి రోడ్డు నుంచి బాలాజీ పేట వెళ్లే రోడ్డును 80 అడుగులుగా వెడల్పు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిటీ ప్లానర్ సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అనితా జూలీ, కె.శ్రీనివాసరావు ,ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరంలో సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగరంలో లక్ష్మిప్రసన్న కుమారి అనే మహిళ మునిసిపాలిటీ రోడ్డు విస్తరణలో తన స్థలం కొంత పోతుందని న్యాయం చేయాలని వేడుకుంది. ఎన్.రామకృష్ణారావు తాను నివాసం ఉంటున్న ప్రాంతంలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని, కోరారు. వీటిపై కమిషనర్ స్పందించారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమవ్వాలి

- జాతీయ లోక్ అదాలత్‌పై పీడీజే సునీత సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. వివిధ బీమా సంస్థలప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులతో సోమవారం సమావేశమయ్యారు. మోటారు వాహనాల ప్రమాదాల కేసుల పరిష్కారం, బాధితులకు తగు పరిహారం చెల్లింపుపై చర్చించారు. ఆ కేసులకు సంబంధించిన జాబి తాను డీఎల్ఎస్ ఏకి అందజేయాలని ఆదేశించారు. త్వరలో నిర్వహించే లోక్ అదాలత్ ముందస్తు సమా వేశాల్లో బీమా సంస్థల ప్రతినిధులు, వాహన ప్రమాద కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు.

వినికిడి యంత్రాల నమోదు ప్రక్రియ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో సోమవారం వినికిడి యంత్రాల నమోదు ప్రక్రియ నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం జరిపారు. మొత్తం 116 మంది పెద్దలు, 21 మంది 18 ఏళ్లలోపు పిల్లలు స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యారు. అర్హులైన వారికి రాబోయే రోజుల్లో వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేయడంజ జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ హరిశ్చంద్ర, ఫౌండేషన్ తరపున స్టేట్ కన్సల్టెంట్ రవితేజ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ విశ్వనాథ్, ఆడియోలజిస్ట్ డాక్టర్ సూర్యనారాయణ, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

బులియన్ మర్చంట్స్ సంఘ
రాష్ట్ర కార్యదర్శిగా జయసింహ



రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన దొండపాటి జయసింహ నియమితులయ్యారు. జయసింహ 2024-27 సంవత్సరాలకు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. జయసింహకు రాజమండ్రి చాంబర్ అధ్యక్షులు తవ్వా రాజా, గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, కార్యవర్గసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కుంతీదేవి ఉత్సవాలు

నల్లజర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుంతిదేవి(గోంతాలమ్మ) ఉత్సవాలు నల్లజర్లలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. ఉదయం అమ్మ వారిని మేళా తాళాలు, తీన్‌మార్ డప్పులతో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గుదే వెంకట సుబ్బారావు, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు గుదే రాంబాబు, గారాపాటి బాబి, అనిల్, డాడీ, సత్యనారాయణ, బొందుల శ్రీను పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలపై
నేడు సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28: రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాల 2027 కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

వివాహితను
రక్షించిన పోలీసులు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ బోయిన వివాహితను పోలీసులు రక్షించారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నామవరం సి బ్లాక్ రింగ్ రోడ్డుకు చెందిన కర్రి నాగబసవ రెడ్డి భార్య నీలాపు శిరీష అతని డైరీలో తాను చనిపోవడానికి వెళుతున్నట్టు రాసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు వెంటనే బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీఐ కాశీ విశ్వనాథ్ ,క్రైమ్ ఏఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి సిబ్బంది ఫోన్ ద్వారా వివాహిత ఆచూకీ గంటలో కనిపెట్టి ధవళేశ్వరం బ్యారేజీపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పట్టుకున్నారు. అటుపై ఆమెను బొమ్మూరు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.ఎస్పీ ఇతర అధికారులు బొమ్మూరు పోలీసులను అభినందించారు.

రూ.6 లక్షల అక్రమ
బాణసంచా స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బొమ్మూరు, రాజానగరం పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమంగా నిల్వచేసిన బాణసంచాపై పోలీసులు దాడులు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు సోమవారం రాజానగరం, బొమ్మూరు పోలీసులు దాడులు చేశారు. సుమారు రూ.6 లక్షల విలువ చేసే అక్రమ బాణసంచా నిల్వలను సీజ్ చేశారు.



నార బాంబులు పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు.. గాయాలపాలైన మృతుడి తల్లిదండ్రులు సావిత్రి, శ్రీనివాస్





వెలుగు వెంటే చీకటి ఉంటుంది.. ఆనందం వెంటే విషాదం ఉంటుంది.. కాస్త ఆదమరుపుగా ఉన్నామా పెను ప్రమాదమే సంభవిస్తుంది.. ప్రాణాలనే హరించేస్తుంది.. దీపావళి ఆనందం ఆదమరుపుగా ఉన్నామా ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే.. ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది.. లేదంటే జీవితాలు బుగ్గి పాలైపోతాయి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా ఏళ్లగా ఇదే సాగుతుంది.. ఎందుకంటే జిల్లాలో అధికార.. అనధికార బాణసంచా తయారీ కేంద్రాలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.. దీంతో ప్రతి ఏడాది జిల్లాను ఏదో ఒక ప్రమాదం వెంటాడుతూనే ఉంటుంది.. అయినా అధికారులకు మామూలే.. అన్నీ తెలిసినా చూసీచూడనట్టు వదిలేస్తారు.. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తారు.. ఈ ఏడాదీ అంతే. మరో మూడు రోజుల్లో దీపావళి పండుగకు సన్నద్ధమవుతున్నాం.. అయినా అధికారులు చేపట్టిన తనిఖీల్లేవ్.. పట్టుకున్న అనధికార తయారీ కేంద్రాలు లేవు.. సోమవారం మండపేట మండలం ఏడిదలో జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ. ఈ రెండు రోజులైనా అధికారులు మేల్కొంటే.. ప్రమాదాలను నివారించవచ్చు.. ప్రజల ప్రాణాలు కాపాడవచ్చు.



వెలుగు వెంటే చీకట్లు!

ఆదమరిస్తే.. జీవితాలే బుగ్గి

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా ఫేమస్
- ఎక్కడికక్కడ తయారీ కేంద్రాలు
- అనధికారికమే ఎక్కువ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు
- ప్రతి ఏటా విషాదం..మామూలే!
- కన్నెత్తి చూడని అధికారులు
- తాజాగా ఏడిదలో ప్రమాదం



అమలాపురం మండలం రావులచెరువులో సంభవించిన విస్ఫోటనంతో కుప్పకూలిన భవనం (ఫైల్)



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జీవితమే ఒక దీపావళి. కొన్ని కుటుంబాల్లో వెలుగులు నింపితే.. మరికొన్ని కుటుంబాల్లో చిమ్మచీకట్లు నింపుతోంది. దీపావళికోసం అహర్నిశలు శ్రమించి బాణసంచా తయారు చేయడంలో నిమగ్నమయ్యే కుటుంబాల్లో ఏదైనా తేడా వస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. ఈ ప్రమాదాల బారినపడ్డవారిలో మృత్యువాత పడే వారి సంఖ్యే ఎక్కువ. మరికొందరు అంగవైకల్యంతో బతుకు జీవుడా అని జీవించాల్సిన పరిస్థితులు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో ఏటా ఎక్కడో ఒకచోట అగ్నిప్రమాదం సంభవిస్తోంది. దీంతో అందులో పనిచేసే తయారీ నిర్వాహకులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో మహిళల సంఖ్యా అధికంగానే ఉంటోంది. గత కొన్నేళ్ల కిందట అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెలలో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరు దివ్యాంగులుగా మిగిలారు. క్షతగాత్రులు బతుకు జీవుడా అని జీవనం సాగిస్తున్నారు. అమలాపురం పట్టణం రావులచెరువులో గత నెల 16వ తేదీన సంభవించిన భారీ విస్ఫోటనంలో గొవ్వాల నాగలక్ష్మి(55) చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. వారిలో కొందరు ఇప్పటికీ అనారోగ్యంతోనే ఇబ్బందిపడుతున్నారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే బాణసంచా ప్రమాదాల కారణంగా దశాబ్దకాలంగా విగతజీవులుగా మారిన వారి సంఖ్య భారీగానే ఉంది. అయితే కుటుంబ పోషణ నిమిత్తం బాణసంచా తయారీ కర్మాగారాల్లో సమీప ప్రాంతాలవారు పనులు చేస్తుంటారు. చాలీచాలని జీతాలతో కాలే కడుపులతోనే జీవిస్తున్నారు. తయారీ కేంద్రాల వద్ద సరైన భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు తలెత్తుతున్నాయని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డబ్బున్నవారు దీపావళీ పండుగను వేడుకగా చేసుకుంటుంటే పేద కార్మికులు మాత్రం పస్తులతో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక కోనసీమలోని వివిధ ప్రాంతాలకు తమిళనాడు రాష్ట్రం నుంచి భారీగా బాణసంచా దిగుమతులు జరుగుతున్నాయి. ఈ సామగ్రి విక్రయాలకే ఈ ప్రాంత వ్యాపారులు మగ్గుచూపుతున్నారు. కోనసీమ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బాణసంచాకు సంబంధించి బాంబులు, సెర్చ్‌లైట్లు, మతాబులు, టపాసులు వంటివి తయారుచేసి విక్రయిస్తున్నారు.

ప్రమాదాలు ఇలా..

- 2019 సెప్టెంబరు 30న జీ.మేడపాడు కెనాల్ రోడ్డులో ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు.
- 2023 ఏప్రిల్ 5న పెదపూడిలో జరిగిన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరి కొందరు గాయపడ్డారు.
- రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ఆంజనేయ ఫైర్‌వర్క్సులో రెండుసార్లు ప్రమాదాలు జరిగాయి. 1996 మే 1 జరిగిన ప్రమాదంలో కర్రి సత్యనారాయణ, ఆయన కుమారుడు కర్రి శ్రీనివాస్ మృతి చెందారు. తదుపరి మరో ప్రమాదంలో బొక్కా సత్తిబాబు అనే వ్యక్తి మృతి చెందాడు. 2003లో తోటపేటలో జరిగిన ప్రమాదంలో ప్రస్తుతం ఆంజనేయ ఫైర్ వర్క్సు యజమానిగా ఉన్న దవులూరి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. అదేవిధంగా రామచంద్రపురం మండలం జువ్విపాడులో ఆనందరావు బాణసంచా తయారీ కేంద్రం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదు గురు మృత్యువాతపడ్డారు. అందులోమహిళలు కూడా ఉన్నారు. బిక్కవోలు మండలం తొస్సిపూడిలో 2023లో జరిగిన ప్రమా దంలో పెట్రోల్ బంక్ ధ్వంసమైంది.

బాణసంచాకు కుటుంబమే బలి

2022 ఫిబ్రవరిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మండపేట పట్టణంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు.అన్నవరపు కోటేశ్వర రావు, కుమారుడు రవికుమార్ మృతిచెం దగా, కొద్దిరోజుల తర్వాత మరో ప్రమాదంలో కోటేశ్వరరావు పెద్ద కుమారుడు చంద్రరావు మృత్యువాతకు గురయ్యాడు. ఇక కోటేశ్వరరావు మనుమడు అయ్యప్ప రాజు, అతడి తల్లి కూడా ప్రమాదంలో కన్నుమూశారు.ఇలా కుటుంబమంతా మందుగుండు ప్రమాదంలోనే మరణించడం మరో విషాదం. అలాగే వారి వద్ద పనిచేసే ఇద్దరు కూలీలు కూడా రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో మరణించారు.

నార బాంబులు చుడుతుండగా పేలుడు

- భర్త మృతి..భార్య పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి గాయాలు..బాలుడు సేఫ్
- ఏడిదలో కుప్పకూలిన పెంకుటిల్లు

మండపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళి ఆ ఇంట విషాదం నింపింది..పండుగను పురస్కరించుకుని నార బాంబులు చుడుతుండగా పెనుప్రమాదం సంభవించింది.. ఆదమరిస్తే ఎంత ప్రమాదమో చాటిచెప్పింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద పంచాయతీ ఆరో వార్డు రామాలయం వీధిలో కల్లి వెంకట కృష్ణ (30) రెండు పోర్షన్ల ఇంట్లో కుటుం బంతో నివాసం ఉంటున్నాడు. దీపావళిని పురస్కరించుకుని తన ఇంట్లో భార్య జయశ్రీతో కలిసి అవుట్లు తయారు చేస్తున్నాడు.ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ఒక్కసారిగా మందుగుండు సామగ్రి పేలడంతో భారీ శబ్దం వచ్చింది.దీంతో అతని పెంకుటిల్లు పైకప్పుతో సహా, సమీపంలో ఉన్న వంటషెడ్డు (రేకుల షెడ్డు) కుప్ప కూలిపోయాయి. పేలుడుధాటికి వెంకట కృష్ణ తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడి భార్య జయశ్రీకి తీవ్రగాయాలు కాగా ఆమెను మండపేట ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో మృతుడు వెంకట కృష్ణ తండ్రి శ్రీనివాస్, తల్లి సావిత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఒక్కసారిగా పేలు డు సంభవించడంతో వారిద్దరూ తీవ్రగా యాలపాలయ్యారు. 108లో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.మృతుడు వెంకటకృష్ణకు ఏడాది బాబు ఉన్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండడంతో క్షేమంగా బయటపడ్డాడు.ఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, రూరల్, సీఐ పీతల దొరైరాజు, రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు,జిల్లా ఫైర్‌అధికారి పార్థసారథి,మండపేట ఫైర్ అధికారి హనుమంతరావు పర్యవేక్షించారు. మండపేట తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పదేళ్లయినా.. అందని సాయం

- వాకతిప్ప పేలుడుకు పదేళ్లు
- 18 మంది దుర్మరణం
- కూటమి ఆదుకోవాలని వినతి

కొత్తపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో బాణసంచా కేంద్రంలో పదేళ్ల కిందట అక్టోబరు నెలలో సంభవించిన పేలుళ్లలో మొత్తం 18 మంది దుర్మరణం పాలయ్యారు.వీరంతా వాకతిప్ప దళిత కాలనీకి చెందిన వారు. బాణసంచా పేలుళ్లలో మృతిచెందిన కుటుంబాలకు అప్పటి సీఎం చంద్ర బాబునాయుడు రూ.2 లక్షల నగదు, స్థానిక విద్యుత్ ప్లాంటు యాజమాన్యం రూ.50 వేలు, పలువురు దాతలు ఆర్థిక సాయం అందిం చారు. బాధిత కుటుంబాలకు మూలపేటలో సర్వే నంబరు 41,42లో అరెకరం చొప్పున 9 ఎకరాల భూమి మంజూరు చేశారు. పేలుడు సంఘ టనలో మృతిచెందిన 18 మందిలో 12 మంది మహిళలు వాకతిప్పకు చెందిన వారే. మిగిలిన ఆరుగురు నిదానందొడ్డి, కలవలదొడ్డికి చెందినవారు.అప్పట్లో అరెకరం భూమికి సంబంధించిన పట్టాలను అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పట్టాలు ఇచ్చాక అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరికి ఆ భూమిని అప్పగించలేదు. దీంతో ఈ భూముల వ్యవహారం ఇప్ప టికీ కొలిక్కిరాలేదు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం భూమి అప్పగిం చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టాలిచ్చిందికానీ..భూమివ్వలేదు..



పేలుళ్లలో మృతిచెందిన 18 కుటుంబాలకు మూలపేట సెజ్ భూముల సమీపంలో ఒక్కొక్కరికి 50 సెంట్ల భూమిని కేటాయించారు. మంత్రి చేతుల మీదుగా పట్టాలిచ్చినా భూమిని అప్పగించలేదు. జగన్ సీఎం అయ్యాక పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి 9 ఎకరాల భూమి ఇవ్వమని అప్పటి తహశీల్దార్ ఒత్తిడి తెచ్చారు. బాధితులు ఒక్కొక్కరికి 3 సెంట్ల భూమిచ్చి దానిలో ఇళ్లు కట్టించి ఇస్తామని భ్రమ కలిగించారు. మేము ఒప్పుకోకపోవడంతో అప్పటి నుంచి బాణసంచా బాధిత కుటుంబాలకు కేటాయించిన భూమి మాట పట్టించుకోలేదు.అప్పటి బాణసంచా ప్రమాదంలో తన భార్యవదిన, మరదలు, తమ్ముడు, మనవరాలు దుర్మరణం పాలయ్యారు. కూటమి ప్రభుత్వం బాణాసంచా బాధితులకు న్యాయం చేస్తుందని ఆశపడుతున్నాను. - మసకపల్లి నాగేశ్వరరావు

ప్రాణం తీసిన వేగం.. ఒకరి మృతి | 8 | నల్లబెల్లం రవాణా.. ఇద్దరి అరెస్టు



కందుకూరి వీరేశలింగం పైలాన్ ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్ చిత్రంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే అప్పారావు తదితరులు

నేనూ ఇక్కడే చదువుకున్నా..

కందుకూరి వీరేశలింగం డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేనూ ఈ కళాశాలలోనే చదువుకున్నా.నేడు మంత్రి హోదాలో కళాశాలకు రావడం ఆనందంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆనంద ఉద్యానవనంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకకు హాజరై మాట్లాడారు. ఎంతో మందికి కందుకూరి కళాశాల పునాదిగా నిలిచిందన్నారు. తాను కూడా కందుకూరి కళాశాల పూర్వ విద్యార్థినేనని గుర్తు చేశారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తి ప్రతి విద్యార్థిలోనూ నిలవాలన్నారు. తొలుత మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు స్వర్ణోత్సవ పైలాన్ ఆవిష్కరించారు.తొలుత వీరేశలింగం విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం పూర్వపు చైర్మన్లు చల్లా శంకరరావు,బుడ్డిగ శ్రీనివాస్, దాసి వెంకట్రావు, యాళ్ళ ప్రదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, వీటీ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ శాంతారాజ్యం, పసుపులేటి శ్రీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 28: కలెక్టరేట్‌కు ప్రజలు పెద్దఎత్తున సమస్యలతో పోటెత్తారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజానగరం మండలం పాలచర్ల గ్రామంలో సర్వే నెంబరు 2282/1985లో 316 చదరపు గజాల భూమిని చట్టపరంగా తాను కొనుగోలు చేసానని.. అయితే ఆ భూమిని వేరేవారు కబ్జాచేసి ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని బాధిత మహిళ మల్లెల రామలక్ష్మి ఫిర్యాదు చేశారు.తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం జీవో రద్దు చేయడం దారుణమని అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. జీవోను పునరుద్ధరించాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతామన్నారు. 25 శాతం ఉచిత సీట్లను పునరుద్ధరించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 30 మంది బాధితులు జేసీని కలిశారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం కోటిలింగాల-3లో గతంలో సుబ్బారావుపేట ఫీల్డ్‌లేబర్ కోఆపరేటివ్ సొసైటికి కేటాయించిన ఇసుక ర్యాంప్ రద్దుచేయాలని మాజీ అధ్యక్షుడు అక్కాబత్తుల శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి మద్దా దుర్గారావు జేసీకి విన్నవించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 28 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలన చేసి వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం కోసం పలు ఆదేశాలు ఇచ్చారు. నిర్దేశిత సమయంలో సమస్యలు పరిష్కారం కావాలన్నారు.

డీఆర్వో బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ/రూరల్,అక్టోబరు (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి డీఆర్‌వోగా తామరాల సీతారామమూర్తి సోమవారం బాధ్యతలు స్వీక రించారు. సీతారామమూర్తి 1995లో ప్రొబెషనరీ డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీకాకుళం జిల్లా కవిట మండలంలో జాయినయ్యారు.విశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ విభా గం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. డీఆర్‌వో జేసీ చిన్నరాముడును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలి

జిల్లా ఎక్సయిజ్ అధికారి లావణ్య

రాజమహేంద్రవరం,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని కచ్చితంగా ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య పేర్కొన్నారు. అధిక ధరలకు అమ్మినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీ ప్రక్రియ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహించడం నేరమన్నారు. సారా, గంజాయి, నిల్వ రవాణా విక్రయం, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు నిషేధమన్నారు. వీటికి సంబంధించి సమాచారం ఉంటే 7093273981 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎస్పీ



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్‌లు ఆర్యోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ నరసింహ కిషోర్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్స వంలో భాగంగా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబీకులకు కిమ్స్ బొల్లినేని హాస్పటల్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రారంభించి రక్తదానం చేశారు. కీళ్ల, క్యాన్సర్, యూరాలజీ, న్యూరా లజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడి యాట్రిక్స్, గైనిక్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసన్,గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ విభాగాలకు చెందిన 22 మంది వైద్య నిపుణులు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు.మందులను ఉచితంగా అందజేశారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. తొలుతగా కిమ్స్ వైద్యులను ఎస్పీ సత్కరించారు.ఈడీ రామ్మోహన్ మాట్లాడుతూ సేవాభావంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వ హిస్తున్నామన్నారు. కిమ్స్ సీఈవో, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామరాజు మాట్లాడుతూ త్వరలోనే క్యాన్సర్, ఈఎన్‌టీ, డెంటల్, తల్లి పిల్లల అత్యాధునిక వైద్య విభాగాలు పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌పై చర్చిస్తున్న పీడీజే గంధం సునీత

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ : పీడీజే

రాజమహేంద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులతో సోమవారం సమావేశమయ్యారు. మోటారు వాహనాల ప్రమాదాల కేసుల పరిష్కారం, బాధితులకు తగు పరిహారం చెల్లింపుపై చర్చించారు. ఆ కేసులకు సంబంధించిన జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ముందస్తు సమావేశాల్లో బీమా సంస్థల ప్రతినిధులు, వాహన ప్రమాద కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు.

ఎండిపోతున్న మొక్కలు

» నిరుపయోగంగా వదిలేసిన వైనం » కొరవడిన పర్యవేక్షణ


సదుపాయం లేక ఎండిపోతున్న మొక్కలు

గోపాలపురం, అక్టోబరు 28: పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి మొక్కలు నాటాలంటూ ప్రభుత్వాలు, పాలకులు ఘోషిస్తున్న క్షేత్రస్థాయిలో అవి అమలుకు అందుకు భిన్నంగా ఉన్నాయి. మొక్కల కొనుగోలుకు ప్రభుత్వ బడ్జెట్లో కేటాయించటంతో పాటు వాటి పెంపకానికి అవసరమైన నిధులను మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేశారు. అయితే మెట్ట ప్రాంతంలో పొగాకు సాగుతో చిన్నాచితకతో పాటు ఆదాయాన్నిచ్చే ఉద్యానపంటలైన జీడి, మామిడి, నిమ్మ, పామాయిల్ దీర్ఘకాలిక పంటలు నేలకొరిగి పొగాకు క్యూరింగ్ బూడిదగా మారుతున్నాయి. గొడ్డలివేటుకు నేలకొరుగుతున్న మొక్కల స్థానంలో పదిమొక్కలు నాటండి ఒక మొక్కను పెరకండి అన్న చందంగా ఐటీసీ కంపెనీ ఈ ప్రాంత రైతులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు కొనుగోలు చేసి రైతులకు పంపిణీకి సిద్ధమైంది. అందులో భాగంగా గోపాలపురంలోని పెద్దగూడెం పరిసర ప్రాంత రైతులకు వేప, సీతాఫలం, జామాయిల్, మొదలగు మొక్కలను 16వ వార్డులో ఒక రైతు బ్యారన్ వద్ద దిగుమతి చేశారు. అయితే రైతులు మొక్కలు తీసుకోవడానికి ఆసక్తి చూపకపోవడమో లేక వాటి పర్యవేక్షణ లోపమో వెరసి ఐటీసీ ఆధ్వర్యంలో పంపిణీకి సిద్ధం చేసిన మొక్కలు తలలు వాలుస్తున్నాయి. ఆ ప్రదేశంలో ఉంచిన కొన్ని మొక్కలు నీటి సదుపాయం లేక చనిపోగా మరికొన్ని మొక్కలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఐటీసీ అధికారులు స్పందించి ఆ మొక్కలపై పర్యవేక్షణ బాధ్యత స్వీకరించి చనిపోగా మిగిలిన మొక్కలను రైతులకు అందజేసి తలవాల్చిన మొక్కలను చిగురింపజేయాలి.

నిబద్ధతతో ప్రజా సేవలందించాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సుస్మిత

విజిలెన్స్ వారోత్సవాల్లో ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులంతా నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులతో లాభాపేక్ష లేకుండా నిబద్ధతతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబరు 28 నుంచి నవంబరు 2వ తేదీ వరకు విజిలెన్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి ఇంటిగ్రిటీపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించాలని, వర్క్షాపులు, గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. వీధి నాటికలు, కవితలు, పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రభుత్వం సర్క్యులర్, జీవోపై ప్రతి కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. జూన్ 30వ తేదీ లోపు వచ్చిన అన్ని ఫిర్యాదులను పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు

ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్లోని 9 మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని, ప్రజలు తమ ఫిర్యాదులు అందించి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆర్డీవో సుస్మిత అన్నారు. డివిజన్ పరిధిలో సోమవారం 4 ఫిర్యాదులను స్వీకరించామన్నారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల వాగ్వాదం

» నిడదవోలు కౌన్సిల్ సమావేశం రసాభాస


కౌన్సిల్ సమావేశ దృశ్యం, చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా కౌన్సిల్ సమావేశంలో సమస్యలు ప్రస్తావించడం, చర్చించడం మాట్లాడుకోవడాలు లేనేలేవు. కౌన్సిల్ అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించ డమే.. కూటమి ప్రభుత్వంలో కొందరు వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో అవసరమున్నా లేకపోయినా అరవడమే పనిగా పెట్టుకుని గౌరవంగా జరగవలసిన కౌన్సిల్ సమావేశాన్ని రసాభసాగా మార్చేస్తున్నారు. సోమవారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. గత సమావేశంలో వాయిదా పడిన 14 అంశాలను ఆమోదించారు. ఈలోగా మరిన్ని అంశాలను కౌన్సిల్ తీసుకురాగా పువ్వల రతీదేవితో పాటు కొందరు వైసీపీ కౌన్సిలర్లు లేచి తాము సూచించిన అంశాలను ఎందుకు అజెండాకు తీసుకురాలేదంటూ కమిషనర్ కృష్ణవేణితో వాగ్వాదానికి దిగారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు మాట్లాడుతూ అజెండాలోని అంశాలను మాత్రమే కౌన్సిల్లో మాట్లాడాలని వైసీపీ హయాంలోనే హుకుం జారీచేశారని, మరిప్పుడు అజెండాలో తాము సూచించిన అంశాలెందుకు పెట్టలేదంటూ ఎందుకు గలాటా సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో అడగడానికి నువ్వు ఎవరంటూ రతీదేవి అనడంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం జరిగింది. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అజెండాలో 24 అంశాలు ఉన్నందున సమయం సరిపోక పెట్టలేదని సమాధానమిచ్చారు. అజెండాలోని అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో పలు శాఖల అధికార్లు పాల్గొన్నారు.

కంటెయినర్‌ను ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు
● దూబచర్ల హైవేపై ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నల్లజర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం దూబచర్ల హైవేపై సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో నరసారావుపేట ప్రకాశనగర్కు చెందిన వేమరెడ్డి(35) అక్కడికక్కడే మృతి చెందగా సాయిరెడ్డి తీవ్ర గాయాలతో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేమరెడ్డి, సాయిరెడ్డి తాళ్లపూడి మండలం గోపవరంలోని ఠాగూర్ కెమికల్ కంపెనీలో పని చేస్తున్నారు. వేమరెడ్డి డ్రైవింగ్ చేస్తుండగా సాయిరెడ్డి పక్క సీటులో కూర్చొన్నాడు. దూబచర్ల హైవేపై ముందు వెళుతున్న కంటెయినర్ను వెనుక నుంచి ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ మోహన్ చెప్పారు.

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు
» నల్లజర్ల పీహెచ్సీని పరిశీలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ



నల్లజర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్సీ) ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు పీహెచ్సీగా ఉన్న ఆసుపత్రి ఎమ్మెల్యే కృషి ఫలితంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్సీ)గా మారనుంది. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీతో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్కు 100 పడకల ఆసుపత్రి నల్లజర్లకు అవసరమని జూలై 8న అర్జీ ఇవ్వగా ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రికి అనుమతులు వచ్చినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మంచి వైద్య అందుతుందని, రోడ్డుకు అనుకుని ఆసుపత్రి నిర్మిస్తున్నామన్నారు. సంబంధిత భూ రికార్డులను సేకరించి ఆరోగ్య శాఖకు అప్పగించాలని తహశీల్దార్ను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, రావూరి వెంకటరమణ, యలమాటి శ్రీనివాస్, డాక్టర్ తెల్లం గంగాధర్, సీరాజుద్దీన్, జీవీవీ ప్రసాద్, తహశీల్దార్ శాంతి ప్రియ, సర్దార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

పెరవలి, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): రాష్ట్రీయ గోకుల్ మిషన్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఖండవల్లిలో పశువైద్యశాల వద్ద ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు పశువైద్యాధికారి డాక్టర్ సల్మా తెలిపారు. ఈ శిబిరంలో అనారోగ్య పశువులకు చికిత్సతోపాటు గర్భకోశ వ్యాధులకు చికిత్స యదకు రాని పశువులకు మందులు,దూడలకు నత్తల నివారణ మందులు అందజేస్తామన్నారు.

రూ.297.98 లక్షల పనులు రద్దు

» పుష్కరాలు విజయవంతం చేయండి
» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
» ఆక్రమణల తొలగింపునకు సహకరించండి: కమిషనర్
» కొవ్వూరు కౌన్సిల్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, చైర్పర్సన్, కౌన్సిలర్లు

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపులైను పనులను నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. గడప గడపకు కార్యక్రమంలో మంజూరైన 92 పనుల్లో 21 పనులు పూర్తి కాగా ఇంకా ప్రారంభించని రూ.297.98 లక్షల విలువైన 71 పనులను రద్దుచేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టైడ్, అన్టైడ్లతో వార్షికాభివృద్ధి ప్రణాళిక ప్రతిపాదనలు, 11 మంది ఔట్సోర్సింగ్ కార్మికుల నియామకానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేస్టేషన్లో కరోనా కారణంగా నిలుపుదల చేసిన అన్ని రైళ్లకు హాల్ట్ కల్పించాలని తీర్మానం చేసి రైల్వే డీఆర్ఎంకు అందజేయాలన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ పట్టణంలోని డ్రైనేజీలు, మున్సిపల్ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టే వారిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంటమణి రమేష్‌బాబు మాట్లాడుతూ రద్దు చేసిన గడప గడపకు పనుల్లో అత్యవసర పనులను వేరే గ్రాంటులో పెట్టి త్వరగా పూర్తిచేయాలన్నారు. బత్తి నాగరాజు మాట్లాడుతూ 8 నెలల క్రితం ప్రతిపాదించిన పనులు కౌన్సిల్‌కి రావడం లేదని, నెల క్రితం పెట్టిన పనులు కౌన్సిల్ ఆమోదం పొందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయుడు గంధం పూజ్య నరసింహ బాపూజి మృతికి కౌన్సిల్ 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు: ఎమ్మెల్యే

గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాభివృద్ధికి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పుష్కరాలు విజయవంతం కావడానికి కౌన్సిలర్లు, పాత్రికేయులు, సీనియర్ సిటిజన్లు సూచనలు అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ను దృష్టిలో పెట్టుకుని మెయిన్‌రోడ్‌ను విస్తరించి, డివైడర్ వేయాలన్నారు. బీటీ రోడ్లు, డ్రైనేజీలను సీసీ రోడ్లుగా మార్పు చేయాలని, టోల్‌గేటు నుంచి వెంకాయమ్మ చెరువు వరకు డివైడర్ను ఆధునీకరించాలన్నారు. లాంచీలరేవు శ్రీకృష్ణచైతన్య స్నానఘట్టం నుంచి గోష్పాదక్షేత్రం వరకు స్నానఘట్టాన్ని పెద్దగా చేయాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాడపల్లి, ఆరికిరేవుల వైపు పుష్కర స్నానఘట్టాలను నిర్మించాలన్నారు. ఆక్రమణల తొలగింపునకు అందరూ సహకరించాలన్నారు. శివానంద మున్సిపల్ పార్క్, మెరకవీధి వాటర్ ట్యాంకుల వద్ద రుడా ఆధ్వర్యంలో పుష్కరకేఫ్‌లు ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మన్నె పద్మ, గంగ్రోతు అంజలీదేవి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు ధాన్యాన్ని సమీప మిల్లులకు తరలించాలి

» ఎమ్మెల్యే ముప్పిడి
» మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా సమీప మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాకు రూ.2300 మద్దతు ధర అందజేస్తోందని, రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా తమ దగ్గరలోని ఏ మిల్లుకైనా ధాన్యం తోలుకోవచ్చునన్నారు. ఎకరానికి 30 క్వింటాళ్ల ధా న్యం ప్రభుత్వం ద్వారా విక్రయించుకోవచ్చునన్నారు. అలాగే మద్దూరుకు వచ్చే రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైందని రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యూఆర్ మునిప్రసాద్, నాయుడు వీర్రాజు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయదికారి కె.మాధవరావు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏవో ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కుంతిదేవి ఉత్సవాలు

నల్లజర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుంతిదేవి(గోంతాలమ్మ) ఉత్సవాలు నల్లజర్లలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. ఉదయం అమ్మ వారిని మేళా తాళాలు, తీన్‌మార్ డప్పులతో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గుదే వెంకట సుబ్బారావు, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు గుదే రాంబాబు, గారాపాటి బాబి, అనిల్, డాడీ, సత్యనారాయణ, బొందుల శ్రీను పాల్గొన్నారు.

గోపాలపురం: వాదాలకుంట గ్రామంలో కుంతిదేవిని బాణసంచా కాల్పులు, డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, నృత్యప్రదర్శనల మధ్య ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేంకటేశుడి హుండీ లెక్కింపు

పెరవలి, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 32 రోజులకు ప్రధాన హుండీ ద్వారా రూ.2,53,517, అన్నదాన హుండీ ద్వారా రూ.5,073 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీ దారు సత్యవర ప్రసాద్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగిందన్నారు.

నల్లబెల్లం రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

● 6360 కిలోలు స్వాధీనం

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): సారా తయారీకి వినియోగించే నల్లబెల్లం రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన బళ్ల వెంకటరమణ, కామన విష్ణుమూర్తి సీతానగరం, దేవరపల్లి, వెంకటనగరం, ధవళేశ్వరం, పోలవరం గ్రామాలకు నల్లబెల్లం రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం మద్దూరులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 6360 కిలోల నల్లబెల్లం, పాసింజర్ ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. సారా తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో ఎస్ఐ ఈతకోట రవికుమార్, హెచ్‌సీలు కేవీవీ సత్యనారాయణ, కె.నారాయణరావు, డేవిడ్‌రాజు, రమణదొర, నాగేశ్వరరావు, పద్మావతి పాల్గొన్నారు.

న్యూలైఫ్ హాస్టల్ పరిశీలన

నల్లజర్ల, అక్టోబరు 28: దూబచర్ల న్యూలైఫ్ హాస్టల్లో విద్యార్థులకు ఎలర్జీ రావడంతో నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యులు మూడు రోజులుగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు. సోమవారం ఎంఈవోలు సత్యనారాయణ, భాగవతి స్కూల్‌కు వెళ్లి పరిశీలించారు. అన్ని వసతులు, పరిసరాలు బాగానే ఉన్నాయని, విద్యార్థులకు చికిత్స అందించడం ద్వారా ఎలర్జీ తగ్గుముఖం పట్టి తరగతులకు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. తాగునీరు, వసతి గృహం పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్లను సంపద తయారీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

ఉండ్రాజవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్(ఎస్‌డబ్ల్యూఎమ్) షెడ్లను సంపద తయారీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వీఎస్ రామారావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కె.సావరం, చివటం గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్లను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు అందజేశారు. గ్రామం నుంచి సేకరించిన చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరు చేయాలన్నారు. కుళ్లిన చెత్తతో వర్మీకంపోస్టును తయారు చేయాలని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అంజనేయశర్మ, మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

» తహశీల్దార్ దుర్గాప్రసాద్
» పలుచోట్ల బాణసంచా దుకాణాల ప్రాంగణాలు పరిశీలన



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్ర

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): దీపావళి సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. కొవ్వూరు లోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను పోలీసు, అగ్ని మాపక అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. సీఐ పి.విశ్వం మాట్లాడుతూ అనుమతి లేకుండా బాణసంచా ఇళ్లు, షాపులు, జనసమూహాల మధ్య గొడౌన్లలో నిల్వలు చేసినా, లైసెన్సు లేకుండా విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద పోలీసుల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎస్ఎస్ వేణు, రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: సీఐ

నిడదవోలు, అక్టోబరు 28 (అంధ్రజ్యోతి): దీపావళికి బాణసంచా విక్రయించే వ్యాపారులంతా నిబంధనల ప్రకారమే దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగించాలని సీఐ పీవీజీ తిలక్ అన్నారు. సోమవారం నిడదవోలులోని చాగల్లు రోడ్డులో బాణసంచా దుకాణాలకు ఏర్పాటు చేసిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ పసుపులేటి శోభన్ కుమార్, తహశీల్దార్ నాగరాజు నాయక్, ఫైర్ ఆఫీసర్ సిబ్బంది ఉన్నారు.

గోపాలపురం: ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ దుకాణదారులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

భద్రత చర్యలు తీసుకోవాలి: ఎస్ఐ

చాగల్లు, అక్టోబరు 28(అంధ్రజ్యోతి): బాణసంచా సామగ్రి అమ్మకాలు జరిపే సమయంలో భద్రత చర్యలు పాటించాలని ఎస్ఐ కె.నరేంద్ర అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దీపావళి సామగ్రి విక్రయదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు.

15 మందికే అనుమతి : తహశీల్దార్

దేవరపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో బాణసంచా విక్రయాల కోసం 15 మందికి అనుమతి ఇచ్చినట్టు తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని బాణసంచా షాపుల నిర్వాహకులు, పోలీసులు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. బాణసంచా షాపులు గ్రామ శివారుల్లో పెట్టుకోవాలని, విద్యుత్‌లైన్లు ఉన్న చోట పెట్టరాదన్నారు. భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, డీటీ శ్రీనివాస్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సివిల్‌సప్లై డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పాటించాలి: ఎస్ఐ

ఉండ్రాజవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్ఐ జి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాణసంచా విక్రయాల కోసం లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్న వారితో ఆయన మాట్లాడారు. దీపావళి విక్రయించే ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు సక్రమంగా పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాత పాలసీ విధానాలు కొనసాగించాలి

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధజ్యోతి): ఎల్ఐసీలో పాత పాలసీ విధానాలను కొనసాగించాలని రాజమహేంద్రవరం డివిజనల్ ఏజెంట్స్ కౌన్సిల్ ప్రెసిడెంటు మాధవరావు డిమాండ్ చేశారు. ఎల్ఐసీ యాజమాన్యం తీసుకొచ్చిన కొత్త విధానాలకు వ్యతిరేకంగా ఏజెంట్ల సంఘం కొవ్వూరు అధ్యక్షుడు పీఎస్ కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. కిషోర్ మాట్లాడుతూ యాజమాన్యం కొత్త విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. జీఎస్టీ రద్దు చేయాలని, పాలసీలపై బోనస్ రేట్లు పెంచాలని, క్లా బాక్ నిబంధనను రద్దుచేయాలని, కనీసం రూ.లక్ష పాలసీలను కొనసాగించాలని, ప్రవేశ వయో పరిమితిని 55 ఏళ్లకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరి ఆకన శ్రీనివాస్, పేపకాయల పోసేష్‌కుమార్, ఇమ్మని శ్రీనివాస్, భోగరాజు శేషుకుమార్, చలమాల శ్రీనివాస్, పోలవరం, దొండపూడి, దేవరపల్లి, నిడదవోలు, చాగల్లు, తాళ్లపూడి ప్రాంతాల ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

దేవదాయ భూమిని కాపాడండి

చాగల్లు, అక్టోబరు 28: మండలంలోని కలవలపల్లి శివాలయానికి చెందిన దేవదాయ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని జి.నరేంద్ర కోరారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన తహశీల్దార్ ఎం.మెరికమ్మకు వినతిపత్రం అందజేసారు. దేవదాయ భూమిని ఇష్టమొచ్చిన విధంగా ఆక్రమించుకుని వ్యవసాయం చేయడంతో పాటుగా క్రయ విక్రయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

కొవ్వూరులో హోటల్‌పై విజిలెన్స్ దాడులు

6 గ్యాస్ సిలిండర్‌లు స్వాధీనం.. యజమానిపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు వినియోగంలో అక్రమాలకు పాల్పడినా, అక్రమ నిల్వలు ఉంచినా యజమానులపై చర్యలు తీసుకుంటామని రీజనల్ విజలెన్స్ ఎన్ఫోర్స్‌మెంటు అధికారిని ఎస్‌పీఎం స్నేహిత అన్నారు. సోమవారం కొవ్వూరులోని హోటళ్లలో డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు వినియోగిస్తున్నారని సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. విజయ విహార్ హోటల్‌లో 6 సిలెండర్లను స్వాధీనం చేసుకుని, యజమాని ఏవీవీ సత్యనారాయణపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ జి.మధుబాబు, డీసీటీవో ఎం.నవీన్‌కుమార్, సీఎస్ డీటీ ఎం.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు తనిఖీలు

దేవరపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మండలంలోని చిన్నాయిగూడెంలో 4 బెల్టుషాపులపై దాడులు జరిపి గ్రామానికి చెందిన దూళిపాళ కాశీ వెంకటరత్నం, యంటపల్లి వెంకటేశ్వరరావు, దేయ్యం అమ్మిరాజులను అరెస్టు చేసి వారి నుంచి 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తి పరారయ్యాడన్నారు. దుద్దుకూరులో కోమటి పుల్లారావును అరెస్టుచేసి అతడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందువుల శ్మశాన భూమిని అప్పగించాలి

నిడదవోలు, అక్టోబరు 28 (అంధ్రజ్యోతి): సమిశ్రగూడెంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న హిందువుల శ్మశాన వాటిక భూమి అన్యాక్రాంతమైందని, దానిని తిరిగి కేటాయించాలని గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ అధికారులకు అర్జీ అందజేశారు. అనంతరం ఆయన నిడదవోలులో మాట్లాడుతూ గ్రామంలోని శివాలయం పక్కన సర్వే నెంబరు 528-2రులో ఉన్న 1.73 ఎకరాల భూమిలో హిందూ శ్మశాన వాటిక ఉండేదని, ఆ భూమి అన్యాక్రాంతం కావడంతో హిందువులు దహన సంస్కారాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులే స్పందించి భూమిని రీ సర్వే చేయించి హిందువుల శ్మశాన వాటికకు కేటాయించాలని సత్యనారాయణ కోరారు.